J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 44 సంచిక : 8 26.07.2024, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## • ఫలిస్తున్న స్నేహం... ఫలితమిస్తున్న బంధం!

# ఆశల బడ్జెట్.. ఆంధ్రాకి జాక్‌పాట్



- రాష్ట్రంపై కేంద్రం వరాల జల్లు
- రాజధానిపై పూర్తి స్పష్టత
- అమరావతి అభివృద్ధికి రూ.15 వేల కోట్లు
- ఏపీలో రైల్వే ప్రాజెక్టులకు రూ. 9 వేల కోట్లు
- పోలవరానికి నిధుల ప్రవాహం

*తాజాగా కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ చూస్తే ఆంధ్రప్రదేశ్‌కి పట్టిన గ్రహణం వీడిందా అనిపిస్తుంది. గత దశాబ్ద కాలంగా అనాథలా మారిపోయిన రాష్ట్రంపై సాక్షాత్తూ ఆ ఏడుకొండలవాడి కరుణా కటాక్షాలు కలిగాయా అన్న భావన కలుగుతోంది. బీజేపీ, టీడీపీ, జనసేన మైత్రితో అటు కేంద్రంలోనూ ఇటు రాష్ట్రంలోనూ ఏర్పడ్డ ప్రభుత్వాల చొరవతో రాష్ట్రానికి మహర్దశ పట్టబోతోందన్న ఆనందం ఆంధ్ర ప్రజలలో కనిపిస్తోంది. జవసత్వాలు కోల్పోయి నిర్జీవంగా పడి ఉండిన అనాధాంధ్రకి జీవంపోసే వరాలని కేంద్ర ప్రభుత్వం తమ తాజా బడ్జెట్‌లో ప్రతిపాదించింది.*

*ఆంధ్రప్రదేశ్‌కు జాక్‌పాట్ లాంటి బడ్జెట్ ఇది. పదేళ్ళ నుంచి ఆశల పల్లకీలో ఎదురు చూస్తున్న ఐదు కోట్ల మంది ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఊరట కల్పించిన బడ్జెట్ ఇది. అభివృద్ధి పూర్తిగా ఆగిపోయి రాష్ట్రప్రజల్లో నైరాశ్యం కమ్ముకున్న వేళ... మళ్లీ ఆశలు చిగురింప జేసిన బడ్జెట్ ఇది.*

*ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంపై కమ్ముకున్న నిస్తేజపు, నైరాశ్యపు మబ్బులు తొలగి అభివృద్ధి కాంతులతో నవోదయపు ఆంధ్రప్రదేశ్ ఆవిష్కృతం కానుందన్న అభిప్రాయం మేధావుల నుండి వ్యక్తమవుతోంది.*

## మోడువారిన అమరావతికి రూ.15 వేల కోట్లతో జీవం!

గత పదేళ్ళలో రాష్ట్రానికి చేసినంత సాయాన్ని కేంద్రం ఈ ఒక్క ఏడాదే ప్రకటించడాన్ని బట్టి ఏపీ అభివృద్ధికి కేంద్రం చూపిస్తున్న చొరవ కనపడుతోంది. ఆర్థిక శాఖ మంత్రి నిర్మలమ్మ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మునుపెన్నడూ లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌కు అధిక ప్రాధాన్యమిచ్చారు. ప్రత్యేకంగా ఒక పేరా పెట్టి రాష్ట్రానికి వరాల జల్లు కురిపించారు. అందులో ముఖ్య అంశం అమరావతి. కేంద్ర ప్రభుత్వంలో తెలుగుదేశం కీలకభాగస్వామిగా ఉన్న నేపథ్యంలో కేంద్రం అమరావతి నిర్మాణానికి, మిగిలిన ప్రాంతాలతో అమరావతి అనుసంధానానికి ప్రాముఖ్యత ఇచ్చింది. బడ్జెట్‌కు ముందు చంద్రబాబు స్వయంగా రెండు సార్లు ఢిల్లీ వెళ్లారు. ప్రధాని మోడీతో పాటు ఇతర కేంద్ర మంత్రులను, ఉన్నతాధికారులను కలిసి రాష్ట్ర ప్రాధాన్యాలను వివరించి నిధుల కేటాయింపులకు విజ్ఞప్తి చేశారు. ఈ నెల 4న ప్రధాని మోడీ కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కలిసి బాబు ఇచ్చిన ప్రతిపాదనలన్నింటికీ దాదాపు బడ్జెట్లో ఆమోదం లభించింది.

రాష్ట్రాలకి రాజధాని ప్రధానమన్నట్లుగా, రాజధాని ప్రాధాన్యతని గుర్తు చేస్తున్నట్లుగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ బడ్జెట్ ప్రసంగం సాగడం, ఆంధ్రప్రదేశ్‌పై కేంద్రానికి ఉన్న ఆసక్తిని కనపరుస్తుంది. రాజధాని నిర్మాణానికి ప్రస్తుతానికి రూ. 15వేల కోట్లు కేటాయించారు. వచ్చే ఏడాది, ఆ తర్వాత కూడా నిధులు ఇవ్వనున్నట్లు స్పష్టం చేశారు. ఈ నిధులు రుణమా, గ్రాంటా, వడ్డీ భారమెంత అన్న సందేహాలు వచ్చినా వాటి గురించి ఆందోళన చెందాల్సిన పని లేదని చంద్రబాబు అన్నారు. నిధులు ఏ రూపంలో వచ్చినా రాష్ట్రానికి మేలేనన్నారు. ఈ నిధులకు పూర్తిగా కేంద్రం పూచీకత్తు అని నిర్మలమ్మ చెప్పగా, ప్రపంచబ్యాంకు నుంచి రుణం తీసుకునే అవకాశం ఉందన్న విశ్లేషణ కూడా వినిపించింది. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ మాత్రం జైకా నుంచి నిధులు వస్తాయంటున్నారు. భాజపా ఎంపీ సీఎం రమేశ్ అయితే ఇది పూర్తిగా కేంద్రం గ్రాంటే అని మీడియాతో మాట్లాడుతూ క్లారిటీ ఇచ్చారు. వివిధ ఏజెన్సీల నుంచి నిధులు సమ కూర్చి పెడతామని కేంద్రం చెప్పింది

10లో



# వామ్మో!.. అమ్మ సొమ్ము తినేశారు

- అడ్డగోలుగా ఉద్యోగాలని అమ్మేసుకున్నారు
- కోటి కుంకుమార్చన పేరుతో కోట్లు దోచేశారు
- ఆలయాన్ని ఛైర్మెన్ అక్రమాలకి అడ్డాగా మార్చేశారు
- ఆ అయిదు కుటుంబాలదే రాజ్యం

నెల్లూరుజిల్లాలో అత్యంత శక్తివంతమైన ఆలయాలుగా ప్రసిద్ధి చెందిన వాటిలో ప్రధానమైన పుణ్యక్షేత్రం శ్రీ జొన్నవాడ కామాక్షితాయి అమ్మవారి దేవస్థానం. ఇతర రాష్ట్రాలు, ఇతర జిల్లాల నుండి కూడా వేలమైళ్ళు ప్రయాణం చేసి భక్తులు అమ్మవారి దర్శనం కోసం వస్తుంటారు. అలాంటి దేవస్థానాన్ని కొంతమంది రాజకీయ నేతలు, అధికారులు తమ స్వార్థం కోసం భ్రష్టు పట్టించారు. దేవాలయాన్ని అక్రమాల నిలయంగా మార్చి తమ జేబులు నింపుకున్నారు. ఖజానా ఖాళీ చేసి, కనీసం నెల జీతాలకి కూడా డబ్బులు లేని దయనీయ స్థితికి అమ్మ ఆలయాన్ని తీసుకొచ్చారు.

3 లో



## న్యూరాలజీలో గోల్డ్‌మెడల్ సాధించిన..
# డాక్టర్ లావణ్య



నెల్లూరులోని ఎనెల్ ఆసుపత్రి ఛైర్మెన్ దశరథ నాగేంద్ర ప్రసాద్ కుమార్తె, ప్రముఖ గుండె వైద్య నిపుణుడు డాక్టర్ కె. నాగేంద్ర ప్రసాద్ సతీమణి డాక్టర్ కె.లావణ్య న్యూరాలజీ విభాగంలో చూపిన ప్రతిభకు బంగారు పతకం లభించింది. చెన్నైలోని శ్రీరామ చంద్రా మెడికల్ కళాశాలలో న్యూరాలజీ కోర్సు పూర్తిచేసిన ఆమె, ఇటీవల ఆ వైద్య కళాశాలలో జరిగిన స్నాతకోత్సవంలో చండీఘర్‌కు చెందిన అమిటి విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ సెల్వమూర్తి చేతులమీదుగా గోల్డ్‌మెడల్‌తో పాటు ప్రశంసాపత్రాన్ని అందుకోవడం విశేషం. ప్రత్యేకించి న్యూరాలజీ విభాగంలో ఆమె టాపర్‌గా నిలిచారు. నెల్లూరులోని నారాయణ వైద్యకళాశాలలో ఆమె ఎంబీబీఎస్, బెంగుళూరులోని సెంట్ మార్తాస్ కళాశాలలో జనరల్ మెడిసిన్ పీజీ కోర్సులను పూర్తిచేసి, చెన్నైలోని శ్రీరామ చంద్ర వైద్యకళాశాలలో న్యూరాలజీ కోర్సును కూడా అభ్యసించారు. వైద్యవిద్యలో ప్రతిభతో రాణిస్తుండడంతో ఆమెకు ఈ అరుదైన ఘనత లభించింది.

# మలుపులు తిరుగుతున్న.. ఫోర్జరీ సంతకాల కేసు

## • జాబితాలో మేయర్ భర్త పేరు ఉండడం సంచలనం

నెల్లూరు నగరపాలక సంస్థలో కమిషనర్ సంతకాలను ఫోర్జరీ చేశారన్న కేసు పలు మలుపులు తిరుగుతోంది. ఈ కేసులో నగర మేయర్ భర్త జయవర్ధన్ పేరు కూడా ఉండడంతో సంచలనం కలిగిస్తోంది. నగరపాలక సంస్థలో గతంలో కమిషనర్‌గా ఉన్న డి.హరిత, ఇటీవలి వరకు కమిషనర్‌గా విధులు నిర్వహించిన వికాస్ మర్మత్‌ల సంతకాలను ఫోర్జరీలు చేసి పలువురు అక్రమాలకు పాల్పడ్డారనే విషయం తేటతెల్లం కావడం, ఆ విషయంపై విచారణ జరిపించాలని వికాస్‌మర్మత్ జిల్లా ఎస్పీని కోరడం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ వ్యవహారంపై నిగ్గుతేల్చడానికి స్థానిక దర్గామిట్ట పోలీసులు రంగంలోకి దిగారు. కమిషనర్ల సంతకాలు ఫోర్జరీ జరిగినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఫోర్జరీ సంతకాలతో భారీగా నగదు చేతులు మారినట్లు కూడా పోలీసులు ప్రాథమికంగా గుర్తించినట్లు సమాచారం. దీంతో, నగర పాలక సంస్థ టౌన్‌ప్లానింగ్ టీపీఓలు ప్రవీణ్‌కుమార్, దేవేంద్ర, వార్డ్ ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ కార్యదర్శులు నాగేంద్ర బాబు, కార్తీక్ మాలవ్య, స్ట్రక్చరల్ ఇంజనీర్ అండ్ లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్ దిలీప్ కుమార్, నగర మేయర్ భర్త జయవర్ధన్, ఆయన అసిస్టెంట్ శివకృష్ణపై కూడా పోలీసులు కేసు నమోదు చేయడంతో నగర పాలక సంస్థలో కలవరం రేగుతోంది.

**దోషులను శిక్షించాలి :**

కమిషనర్ల సంతకాలను ఫోర్జరీ చేసి అక్రమాలకు పాల్పడిన కేసులో పూర్తిస్థాయి విచారణ జరిపించి దోషులను శిక్షించాలని న్యాయవాది కాకు మురళీరెడ్డి ఈనెల 20న నెల్లూరు ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో కోరారు. ప్రశ్నించే గొంతుక, ప్రజా పోరాటాల వల్లే అవినీతి అక్రమాలను ఆపగలమని, ఈ ఫోర్జరీ కుంభకోణం కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేసినంత మాత్రాన సరిపోదని, అందులో సంబంధం ఉన్నవారందరినీ చట్టం ముందు నిలబెట్టాలన్నారు. దీనిపై విజిలెన్స్ విచారణ త్వరగా పూర్తి చేయాలని ఆయన విజ్ఞప్తిచేశారు.

## వీఎస్‌యు వీసీగా
# విజయభాస్కర్‌రావు



నెల్లూరులోని విక్రమ సింహపురి యూనివర్శిటీ (వీఎస్‌యు) ఇన్‌చార్జి ఉప కులపతి (వైస్ చాన్సలర్)గా ఆచార్య ఎస్. విజయభాస్కర్‌రావు కొత్తగా నియమితులై ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వీఎస్‌యు అధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన వీఎస్‌యులోని పలు విభాగాలను సందర్శించి వాటి పనితీరును తెలుసుకుని, అవసరమైన మార్పులను సూచించారు. విద్యార్థులు, అధ్యాపకులు, అధికారులు అందరినీ కలుపుకని సమన్వయంతో విశ్వవిద్యాలయం అభివృద్ధి ధ్యేయంగా తాను పనిచేస్తానని చెప్పారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డా.కె సునీత తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై..
# అవగాహన



జులై 1 నుంచి 30వ తేదీ వరకు జరుగుతున్న డెంగ్యూ మాసోత్సవాల సందర్భంగా ఇటీవల ఆత్మకూరు మండలం మురగళ్ళ గ్రామం జడ్పీ ఉన్నతపాఠశాల విద్యార్థులకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కలిగించారు. ఆత్మకూరు ఆరోగ్య సబ్‌యూనిట్ అధికారి ఖాదర్‌బాషా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, వంటి వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు.

# ఈఎస్ఐ కార్డులు అందజేత

బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలో ఔట్‌సోర్సింగ్ కార్మికులుగా ఉన్న పారిశుద్ధ్య కార్మికులకు ఇటీవల నగర కమిషనర్ రమణబాబు ఈఎస్ఐ కార్డులు అందజేశారు. కార్మికులు, వారి కుటుంబసభ్యుల ఆరోగ్యం సరిగా లేనప్పుడు ఈఎస్ఐ కార్డులను ఉపయోగించుకుని, ఎలాంటి ఖర్చు లేకుండా వైద్యం అందుకోవచ్చని తెలిపారు.




# నాకు పదవీ విరమణ తప్ప.. పెదవీ విరమణ లేదు

## • చెన్నై మీట్ & గ్రీట్‌లో వెంకయ్యనాయుడు



భారత 13వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడుకి ఇటీవల "పద్మవిభూషణ్" పురస్కారం లభించిన సంగతి తెలిసిందే. ఆ సందర్భంతో పాటు ఆయన 75వ జన్మదినాన్ని పురస్కరించుకుని చెన్నైలోని అయన ఆప్తులు, అభిమానులు మీట్&గ్రీట్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. జులై 20వతేదీ శనివారం చెన్నై, లీలాప్యాలెస్ హోటల్లో జరిగిన ఈ కార్యక్రమంలో వెంకయ్య అభిమానులతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొని ఆయనని అభినందించారు. ఈ సందర్భంగా వెంకయ్య మాట్లాడుతూ, తాను పదవీ విరమణ చేశానే తప్ప... పెదవీ విరమణ చేయలేదని చమత్కరించారు. సమాజం కోసం, దేశ అభ్యున్నతి కోసం తన గళం వినిపిస్తూనే ఉంటానని చెప్పారు. తాను పదవులలో వున్నా, లేకపోయినా తనని ఒకేలా అభిమానిస్తున్న వారందరికీ తన కృతజ్ఞతలు తెలిపారు.





వెంకయ్య కుమార్తె ఇమ్మణ్ణి దీపా వెంకట్ సారధ్యంలో జరిగిన సభా కార్యక్రమానికి శ్రీసిటీ స్ఫూర్తిప్రదాత రవి సన్నారెడ్డి స్వాగతం పలికారు. కార్యక్రమంలో తమిళనాడుకి చెందిన పలువురు పారిశ్రామిక, విద్య, వైద్య, పత్రిక, రాజకీయ రంగాల ప్రముఖులు, వెంకయ్య సహచరులు, ఆయన ఆప్తులు పాల్గొన్నారు.

ఇటీవల భారత ప్రధానమంత్రి చేతులమీదుగా ఆవిష్కృతమైన వెంకయ్య జీవిత చిత్రానికి సంబంధించిన మూడు గ్రంథాలని ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రముఖులకు అందించారు. వెంకయ్య సమీప బంధువు సుబ్బానాయుడు వెంకయ్యపై రచించి ఆలపించిన పద్యం కార్యక్రమంలో హైలైట్‌గా నిలచింది. శ్రీసిటీ రవిసన్నారెడ్డి, సీబ్రోస్ సుబ్బారెడ్డి, ఆర్.ఎం.కేవి.మునిరత్నం నాయుడు, భాజపా నాయకుడు చక్రవర్తినాయుడి సమన్వయంతో జరిగిన ఈ కార్యక్రమం ఆద్యంతం ఆత్మీయ, రమణీయ, కమనీయ వేడుకగా సాగింది.

# వామ్మో!.. అమ్మ సొమ్ము తినేశారు

(మొదటిపేజీ తరువాయి)



స్థానిక రాజకీయనేత అండతో ఛైర్మెన్ పదవిని కొనుక్కున్న ఓ పెద్దమనిషి గత రెండేళ్ళలో ఆలయాన్ని భ్రష్టు పట్టించాడు. తాను ఛైర్మెన్ పదవిని కొనుక్కున్నట్లుగానే దేవస్థానంలో ఉద్యోగాలని అమ్మకానికి పెట్టాడు. ఆలయ ప్రధాన అధికారితో కలిసి ఈ దందా నడిపాడని అక్కడ స్థానికులు తెలుపుతున్నారు. గత రెండేళ్ల కాలంలో ఆలయంలో 32 మందిని కొత్తగా నియమించాడని దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు చెప్తున్నారు. ఓ వైపు ఉద్యోగాలు అమ్ముకుంటూనే మరోవైపు కోటి కుంకుమార్చన సేవని కూడా తన దోపిడీకి వాడుకున్నాడని అక్కడివారు అంటున్నారు. శాశ్వత ఉభయకర్తలతో పాటు తాను డబ్బు తీసుకున్న వారిని కూడా ఈ సేవలో భాగస్వామ్యులని చేయడం రివాజుగా పెట్టుకున్నాడట ఈ దళారి. అంతకముందు 2014లో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు కూడా ఈ ప్రభుద్దుడే ఆలయ ఛైర్మెన్. మళ్ళీ వైసీపీ రాగానే పార్టీ మారి ఛైర్మెన్ పదవిని కొనుక్కున్నాడు. ఇప్పుడు మళ్ళీ టీడీపీలోకి వచ్చి చేరాడు. ఆలయాన్ని తన అక్రమాలకి అడ్డాగా మార్చుకున్న ఈ నాయుడు, ఇప్పుడు చంద్రబాబునాయుడు రాగానే మళ్ళీ తానే ఛైర్మెన్ కాబోతున్నానని బయట చెప్పుకుంటున్నాడని ఆలయ చుట్టుపక్కల వాళ్ళు చెవులు కొరుక్కుంటున్నారంట.

### ఆ అయిదు కుటుంబాలదే పెత్తనం

ఓ వైపు ఛైర్మెన్, అధికారుల అరాచకాలు ఇలా కొనసాగుతుంటే... మరోవైపు అర్చకుల ఆధిపత్యం కూడా ఆలయ అభివృద్ధికి ఆటంకంగా నిలుస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. అనాదిగా ఓ అయిదు కుటుంబాలకి చెందినవారే అర్చకులుగా చలామణీ అవుతున్నారని, ఇక్కడ వారు చెప్పిందే వేదం, చేసిందే శాసనం... అన్నట్లుగా వారి ఆగడాలు కొనసాగుతున్నాయని గగ్గోలు పెడ్తున్నారు. ఎవరైనా వీరిని ఎదిరిస్తే వారిని ముప్పుతిప్పలుపెట్టి మూడు చెరువుల నీళ్లు తగ్గించడంలో ఈ అర్చక బృందం ఆరితేరిపోయారని కూడా స్థానికులు వాపోతున్నారు.

### అక్రమాలపై... దృష్టిపెట్టిన ప్రశాంతిరెడ్డి!

జొన్నవాడ ఆలయంలో జరిగిన, జరుగుతున్న అక్రమాలపై కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దృష్టి సారించారు. ఈ క్రమంలో ఆమె దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కలిసి పరిస్థితిని ఆయన దృష్టికి తెచ్చారు. వెంటనే స్పందించిన మంత్రి దర్యాప్తుకి ఆదేశించారు. అమరావతి నుండి వచ్చిన దేవాదాయ శాఖ డెప్యూటీ కమిషనర్ తన దర్యాప్తులో అక్రమాలను కనుగొన్నారు. కోట్ల రూపాయలు గోల్‌మాల్ జరిగినట్లు గుర్తించారు. గడచిన రెండేళ్ళలో ఛైర్మెన్, ఈఓ తీసుకున్న స్వార్ధపూరిత, అర్ధరహిత నిర్ణయాలతో ఆలయంలో సిబ్బందికి సైతం జీతాలిచ్చే పరిస్థితి లేదని గమనించారు. వాస్తవ పరిస్థితులతో పాటు జరిగిన అక్రమాల భాగోతాన్ని తమ ఉన్నతాధికారుల దృష్టికి నివేదిస్తామని చెప్పి వెళ్లారు.

ప్రశాంతమ్మ రాకతో కామాక్షమ్మ ఆలయానికి మంచి రోజులు వచ్చాయని స్థానికులు ఆనందపడుతున్నారు. ఇంతటి మహిమ, శక్తి, ప్రాభవం ఉన్న అమ్మవారి ఆలయం అనాదిగా ఎలాంటి అభివృద్ధికి నోచుకో కుండా వుందని, ఇన్నాళ్ళకి అమ్మ ఆగ్రహించి.. ప్రశాంతమ్మని పంపిందని భక్తజనులు సంతోషపడుతున్నారు.

# ముత్తుకూరు అక్రమాలు.. పవన్ దృష్టికి!



ముత్తుకూరు పంచాయతీలో కోట్లాది రూపాయలు దుర్వినియోగం జరిగిందని, విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆ పంచాయతి సర్పంచ్ బూదూరు లక్ష్మి ఈనెల 24న డెప్యూటి సీఎం పవన్‌కల్యాణ్‌ను కలసి విజ్ఞప్తి చేశారు. ఆ పంచాయతీలో జరిగిన అక్రమాలను వివరించడానికి డిప్యూటీ సీఎం పిలుపుతో ఆమె అసెంబ్లీకి వెళ్లి పవన్‌ను కలిశారు. పంచాయతీలో మూడేళ్ళుగా వైకాపా నాయకులు, పంచాయతి కార్యదర్శి భారీ స్థాయిలో అక్రమాలకు పాల్పడ్డారని వివరించారు. ఆ నిధులను రికవరీ చేసి పంచాయతీ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. గిరిజన సర్పంచ్ గోడుపై స్పందించిన పవన్ కళ్యాణ్, అక్రమాలకు పాల్పడిన వైకాపా నాయకులతో పాటు, అధికారులపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, టీడీపీ నాయకులు ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, నీలం మల్లికార్జునయాదవ్, షేక్ అబ్దుల్‌షఫీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

# శ్రీసిటీలో.. 'చిన్మయ మిషన్' గురువులు



చెరివిలోని శిధిలావస్థలో ఉన్న శ్రీ చెన్నకేశవ ఆలయాన్ని పరిశీలిస్తున్న స్వామీజీలు

చిన్మయ మిషన్ ఆధ్యాత్మిక గురువులు స్వామి మిత్రానంద(చెన్నై), స్వామి రఘువీరానంద (విశాఖపట్నం), తమ సంస్థ ప్రతినిధులతో కలసి ఈనెల 24న శ్రీసిటీని సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి వారికి సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రగతి, ప్రత్యేకతలను, శ్రీసిటీ చేపడుతున్న కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమాలను, శ్రీవాణి ద్వారా నిర్వహిస్తున్న సాహిత్య, ఆధ్యాత్మిక కార్యకలాపాలను వివరించారు. శ్రీసిటీ పరిసరాలతో పాటు శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయం, చెరివిలోని శిధిలావస్థలో ఉన్న శ్రీ చెన్నకేశవ ఆలయాన్ని స్వామీజీలు సందర్శించారు. శ్రీసిటీ నర్సరీలోని పచ్చదనాన్ని తిలకించారు. శ్రీసిటీ పారిశ్రామిక ప్రగతిని ప్రశంసించడంతోపాటు శ్రీసిటీ ఎం.డీ రవీంద్ర సన్నారెడ్డి కృషిని అభినందించారు. శ్రీసిటీ చిన్మయ సీబీఎస్ఈ పాఠశాలను విస్తరించి, మరింత ఉత్తమ ప్రమాణాలతో విద్యను అందించడం ద్వారా ఈ ప్రాంత విద్యాభివృద్ధికి సహకరించాలని ఈ సందర్భంగా చిన్మయ మిషన్ ప్రతినిధులకు రవీంద్ర సన్నారెడ్డి విజ్ఞప్తి చేశారు. అందుకు స్వామీజీలు సానుకూలంగా స్పందిస్తూ, తప్పక పరిశీలిస్తామన్నారు.

# 'ఆనం' ఆదేశాలతో కదిలిన అధికారులు

## • ఆత్మకూరులో బీసీ హాస్టల్ ఏర్పాటుకు పరుగులు

గతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఆత్మకూరు ఇన్‌ఛార్జిగా ఉన్న ఆనం రామనారాయణరెడ్డి ఆత్మకూరు నియోజకవర్గానికి బాలికల బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలను మంజూరు చేయించారు. అయితే, ఆ తర్వాత ప్రభుత్వం మారడంతో దానిని ఇప్పటికీ ప్రారంభించకుండా అధికారులు అలాగే గాలికి వదిలేశారు. ఇప్పుడు మళ్ళీ రామనారాయణరెడ్డి ఆత్మకూరులో ఎమ్మెల్యేగా గెలుపొంది మంత్రిగా రావడంతో దానికి మోక్షం లభించింది. ఆ హాస్టల్‌ను ఇప్పటికీ ఏర్పాటు చేయలేదని తెలుసుకున్న మంత్రి ఆనం, వెంటనే ఆ హాస్టల్‌ను ప్రారంభించాలని బీసీ వెల్ఫేర్ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. దీంతో, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి వెంకటయ్య, ఆత్మకూరు ఆర్డీఓ మధులత, స్థానిక అధికారులతో కలిసి ఆత్మకూరు పట్టణంలో అందుకు అనువైన భవనం కోసం వేట ప్రారంభించారు. పట్టణంలోని పలు ప్రాంతాలలో ప్రభుత్వ, ప్రైవేటు భవనాలను పరిశీలిస్తున్నారు.

# అమృత్ రైల్వేస్టేషన్‌లలో.. నెల్లూరుకు స్థానం

రైల్వేస్టేషన్ల అభివృద్ధిలో భాగంగా కేంద్రం దేశంలోని 73 రైల్వేస్టేషన్లను 'అమృత్ స్టేషన్ల'గా అభివృద్ధి చేసేందుకు సంకల్పించింది. అందులో నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్ కూడా ఒకటి కావడం పట్ల జిల్లా ప్రజానీకం సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే నెల్లూరు రైల్వేస్టేషన్‌లో 102 కోట్ల రూపాయల వ్యయంతో కేంద్రం పలు అభివృద్ధి పనులు చేయిస్తోంది. రైల్వేశాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్ తాజాగా ప్రకటించిన అమృత్ స్టేషన్ల జాబితాలో నెల్లూరు రైల్వేస్టేషన్ కూడా ఉండడం వల్ల ప్రయాణీకులకు మరిన్ని సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని భావిస్తున్నారు. నెల్లూరు, ఉమ్మడి నెల్లూరుజిల్లాలోని గూడూరు, సూళ్ళూరుపేట రైల్వేస్టేషన్లు కూడా ఈ జాబితాలో ఉండడం విశేషం.

లాయర్
జులై 26, 2024

# అనారోగ్యాలు.. దేశాభివృద్ధికి అవరోధాలు!

'ఆరోగ్యమే మహాభాగ్యం' అన్నారు మన పెద్దలు. అంతే కాదు, ఆరోగ్యంగా ఎలా ఉండాలో కూడా చెప్పారు. ఎలాంటి ఆహారం ఆరోగ్యాన్నిస్తుందో చేసి చూపించారు. వాటిని పాటించేవారు నేటికీ ఆరోగ్యంగానే ఉంటున్నారు. కానీ, అవన్నీ పాతకాలపు వ్యవహారాలుగా కొట్టిపారేస్తుండడం వల్ల, సమాజంలో ఆధునికత పేరుతో అనారోగ్యకర వాతావరణం ప్రబలిపోవడం వల్ల సమస్యలు మరింతగా అధికమవుతున్నాయి. నేటి కాలంలో దాదాపు ప్రతి కుటుంబంలో ఏదో ఒక ఆరోగ్య సమస్య ఉండనే ఉంటోంది. శారీరక సమస్యలతో పాటు మానసిక ఒత్తిడులు కూడా అధికమవుతున్నాయి. దీంతో ఆరోగ్య వ్యయం పెరిగిపోయి, ఉత్పాదక శక్తి తరిగిపోయి, తద్వారా దేశ ఆర్థికవృద్ధి క్రమేణా క్షీణిస్తోందని నిపుణుల తాజా అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. మొన్నటి బడ్జెట్ ప్రసంగాలప్పుడు కూడా కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ ప్రజలు చేజేతులా కొని తెచ్చుకుంటున్న అనేకరకాల ఆరోగ్య సమస్యలను ప్రత్యేకంగా ప్రస్తావించడం గమనార్హం. ఆ వివరాల ప్రకారం చూసినా, 2015-16 జాతీయ మానసిక ఆరోగ్య సర్వే ప్రకారం దేశవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో కంటే పట్టణ ప్రాంతాల్లో అనారోగ్య సమస్యలు ఎక్కువగా విజృంభిస్తున్నాయి. గ్రామీణుల్లో ఈ సమస్యలు 6.9 శాతం ఉంటే, పట్టణాల్లో అది 13.5 శాతంగా ఉంది. నగరాల్లోనూ 4.3 శాతం ప్రజలు అనారోగ్యాలతో బాధపడుతున్నవారే. దీని వల్ల దేశంలో ఉత్పాదకత తగ్గిపోతుందని కేంద్ర గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. మరోవైపు వృద్ధుల్లో కూడా మానసిక ఆందోళనలు 10.6శాతం దాకా పెరిగినట్లు తేలింది. అధిక శాతం యువతలో అనారోగ్య సమస్యలుండడం వల్ల దేశాభివృద్ధికి, ఆర్థిక పురోభివృద్ధికి అవరోధాలు ఏర్పడుతున్నాయని స్పష్టమవుతోంది. ముఖ్యంగా 25 నుంచి 44 ఏళ్ళ మధ్య వయసున్న వారిలో మానసిక సమస్యలు ఎక్కువగా ఉంటున్నాయని, కరోనా మహమ్మారి విజృంభణతో ఈ సమస్యలు మరింతగా పెరిగాయని నిపుణుల అధ్యయనాలు తేటతెల్లం చేస్తున్నాయి. యువత సామాజిక రుగ్మతల నుంచి బయటపడితే తప్ప ఈ పరిస్థితి ఒక కొలిక్కి రాదని కూడా నిపుణుల అభిప్రాయం. అందుకు సానుకూల వాతావరణంతో పాటు, అవసరమైన చికిత్సలు కూడా అందుబాటులోకి రావాల్సి ఉంది. యుక్త వయసులో ఉన్నవారు, విద్యార్థులు సెల్‌ఫోన్లు, ఇంటర్నెట్‌లలోనే ఉన్న సమయాన్నంతా వెచ్చిస్తుండడం, చిన్నారులు కూడా గంటల తరబడి వీటితోనే కాలక్షేపం చేయడం వల్ల అనేకరకాల ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని వైద్యనిపుణులు చెప్తున్నారు. అంతేకాదు, దేశంలో 23.8 శాతం మంది చిన్నారులు స్మార్ట్‌ఫోన్లకు అలవాటుపడిపోయారని, అవి లేకుంటే క్షణం కూడా గడవని పరిస్థితి ఏర్పడిందని, వీటివల్ల దాదాపు 37.2 శాతం మంది చిన్నారులు, లేదా విద్యార్థులు పూర్తిగా చదువుపై శ్రద్ధ చూపడం లేదని అధ్యయనాలు వివరిస్తున్నాయి. దేశంలో అనారోగ్యాలకు మూలకారణం అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లేనన్నది స్పష్టం. సంప్రదాయబద్ధమైన మంచి ఆహారాన్ని వదులుకుని పిజ్జాలు, బర్గర్లు, ఫాస్ట్‌ఫుడ్‌ల వంటి అధునాతన ఆహారంతో, లేనిపోని దురలవాట్లతో ఉన్న ఆరోగ్యాన్ని కాస్తా పాడుచేసుకుంటున్నారు. పౌష్టికాహారం తీసుకోకపోవడం, వేళకు నిద్రపోక పోవడం, వ్యాధినిరోధక శక్తిని పెంపొందించే ఆహారపదార్థాలను వినియోగించకుండా చిత్తానుసారం వ్యవహరించడం వల్ల అత్యధికశాతం మంది అనారోగ్యాల బారినపడుతున్నారు. ఇవన్నీ కూడా దేశ ఆర్థిక వృద్ధిపై బాగా ప్రభావం చూపుతున్నాయనేది దీని సారాంశం. అంతేకాదు, అధిక జనాభా దేశాభివృద్ధికి కీలకంగా ఉన్న నేటి తరుణంలో దేశవ్యాప్తంగా స్థూలకాయుల సంఖ్య భారీగా పెరగడం దేశ ఆర్థికవృద్ధికి మరో పెద్ద అవరోధంగా తయారవుతోందని కేంద్రం ఆందోళన వ్యక్తం చేస్తోంది. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం స్థూలకాయం పురుషుల్లో 22.9శాతానికి, మహిళల్లో 24శాతానికి పెరిగింది. స్థూలకాయం(అధిక బరువు లేదా ఒబెసిటీ) ఇంతగా పెరిగిపోతుండడం దేశాభివృద్ధికి మరో ఇబ్బందికర పరిణామమని ఆ సర్వే పేర్కొంది. వియత్నాం, నమీబియాల తర్వాత స్థూలకాయంలో భారత్ మూడవస్థానంలో ఉందని, ఈ సమస్యలను అధిగమించకుంటే, భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారే కలను మరచిపోవాల్సిందేనని కూడా ఆర్థిక సర్వే స్పష్టం చేయడం అందరూ గమనించదగిన అంశం. ఇకనైనా దేశప్రజలు ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ వేళకు మంచి పౌష్టికాహారం తీసుకోవడం, సంప్రదాయబద్ధమైన వంటకాలకు ప్రాధాన్యత ఇవ్వడం, యోగా-వ్యాయామం వంటి వాటిని పాటిస్తూ శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండడం అవసరం. ఏదేమైనా, ఆరోగ్య భారత్‌తోనే దేశానికి భవిత అన్నది సుస్పష్టం.

## ఆంధ్రాలో కొత్త కల్చర్!

జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో ఆంధ్రప్రదేశ్‌లో కొత్త సంస్కృతి పురుడు పోసుకున్నట్లు కనిపిస్తోంది. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు తొమ్మిదిన్నర సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆ తరువాత 2004లో రాజశేఖరరెడ్డి సారథ్యంలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చింది. కానీ, పదేళ్ళు ప్రతిపక్షంలో ఉండి ఆ తరువాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌పార్టీ కానీ, ఆ పార్టీ నాయకులు కానీ అప్పట్లో ఎక్కడా కక్ష సాధింపు చర్యలకి పాల్పడలేదు. ప్రత్యర్థి పార్టీ నాయకులపై దాడులు చేయడం, బూతులు తిట్టడం వంటి చేష్టలకి పూనుకోలేదు. రాష్ట్రం విడిపోయిన తర్వాత తొలిసారిగా జరిగిన ఎన్నికలలో 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ కూడా గత ప్రభుత్వాల పాలన జోలికి వెళ్ళలేదు. తమ పార్టీ విధానాలు, సిద్ధాంతాలతో పాలన సాగించారు.

కానీ, 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ కొత్త సంప్రదాయానికి తెర లేపినట్లు అనిపిస్తుంది. గత ఐదేళ్లగా వైసీపీ లీడర్లు అవలంభించిన విధానాలే అందుకు సాక్ష్యం. అధికారంలోకి వచ్చీ రాగానే చంద్రబాబు పాలనపై ధ్వజమెత్తారు. ప్రజావేదిక కూలగొట్టారు. ఆయన చేపట్టిన అన్ని అభివృద్ధి కార్యక్రమాలకి మంగళం పాడారు. రాజధానిని అటకెక్కించారు. అసెంబ్లీ వేదికగా బూతు పారాయణాలు పఠించారు. మహిళలని సైతం వదిలిపెట్టకుండా ప్రత్యర్థి పార్టీ నేతల కుటుంబసభ్యులపై ఆరోపణలు చేశారు. తమిళనాడు తరహా రాజకీయ విధానాలను వైసీపీ నేతలు ఆంధ్రాలో అవలంభించారు. ఇప్పుడు కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి నాయకులు గత ప్రభుత్వ అరాచకాలకు బదులుతీర్చుకునే దిశగా అడుగులు వేస్తున్నారు. అది మంచి సంస్కృతి కాదు. వ్యక్తిగత ద్వేషాలతో, కక్షసాధింపు చర్యలతో ఒకరిపై ఒకరు దాడులు చేసుకుంటూపోతే రాష్ట్రానికి నష్టం జరుగుతుంది. అభివృద్ధి కుంటుపడుతుంది. భావితరాలకు నష్టం జరుగుతుంది. ఆంధ్రాలో వైసీపీ ప్రారంభించిన ఈ కొత్త కల్చర్‌కి టీడీపీ సమాధి కట్టాలి!

యం. చంద్రమౌళి, కొత్తఢిల్లీ.

## ఆర్భాటం తక్కువ.. ఏర్పాట్లు ఎక్కువ!

ఈసారి రొట్టెల పండుగలో ఏర్పాట్లు చాలా బాగున్నాయి. ప్రతిసారీ ప్రభుత్వ యంత్రాంగం, రాజకీయ నాయకులు ప్రచార ఆర్భాటంతోనే సరిపెట్టేవారు తప్ప ఏర్పాట్లపై దృష్టి పెట్టేవారు కాదు. ఈసారి అలాకాకుండా ప్రతీ చిన్న విషయంలోనూ అధికారులు, నాయకులు చర్యలు తీసుకున్నారు. ప్రపంచ నలుమూలల నుండి వచ్చే సందర్శకులకు ఎక్కడా చిన్న అసౌకర్యం కూడా కలగకుండా వసతులు కల్పించారు. నగరంలో ట్రాఫిక్ నియంత్రణలో కూడా ఈసారి పోలీసుశాఖ వారు ప్రత్యేకదృష్టి పెట్టడం అభినందనీయం. పార్కింగ్ విషయంలోనూ ఎలాంటి ఇబ్బందులు కలగనీయకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు. మొత్తంమీద ప్రభుత్వ అధికారులు, రాజకీయ నేతలు, పోలీసుశాఖ వారి సమిష్టి సమన్వయంతో పండుగ సాఫీగా జరిగిపోయింది.

షేక్ రెహమాన్ - జెండావీధి, నెల్లూరు.

ఈ-మెయిల్ ప్రజావాణి
lawyerpatrika@gmail.com
WhatsApp +91 98663 14741



సత్యపీఠం
నిజాలే మాట్లాడుకుందాం! 48

## 'అమ్మ పేరుతో ఒక్క మొక్క' ప్రకృతికి శ్రీరామ రక్ష!

### నాడు స్వచ్ఛభారత్... నేడు పచ్చభారత్!!

దేశవ్యాప్తంగా పచ్చదనం, పరిశుభ్రత కరువైపోతోంది. రణగొణ ధ్వనులతో రోడ్లపై తిరుగుతున్న కోట్లాది వాహనాలు, దేశవ్యాప్తంగా అవతరించిన లక్షలాది పరిశ్రమల నుండి వస్తున్న కాలుష్యంతో పర్యావరణం కలుషితమైపోతోంది. భరించలేనంత వేడిమితో నేలతల్లి అల్లాడుతోంది. వాతావరణ పరిస్థితులు తారుమారై ధరణిమాత విలవిలలాడుతోంది. గతంలో కనీవినీ ఎరుగనంత గ్రీష్మతాపానికి జనం గురవుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో మానవ మనుగడకు మూలాధారమైన ప్రకృతిని, పచ్చదనాన్ని కాపాడుకోవాలి. అందుకు అవసరమైన అడుగులు పడకపోతే నేటితరంతో పాటు భావితరాలకి కూడా కష్టాలు తప్పవు. సరిగ్గా ఇదే ఆలోచనతో మన ప్రధాని నరేంద్రమోడీ ఒక బృహత్తర కార్యక్రమానికి రూపకల్పన చేశారు. 'అమ్మ పేరుతో ఓ మొక్క' అనే నినాదాన్ని తెరపైకి తెచ్చారు. మీకు జన్మనిచ్చిన మీ కన్నతల్లి పేరుతో ఓ మొక్క నాటండి అంటూ పిలుపునిచ్చారు. తానే స్వయంగా తన తల్లి పేరుతో ఓ మొక్క నాటి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రకృతి పరిరక్షణ కోసం దేశప్రజలకు ప్రధాని ఇలాంటి పిలుపునివ్వడం పట్ల, పర్యావరణవేత్తలు, శాస్త్రవేత్తలు, మేధావులు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అమ్మ మనల్ని కంటికి రెప్పలా ఎలా కాపాడుతుందో, అదే స్ఫూర్తితో మనం నాటే మొక్కని కూడా ప్రేమగా పెంచి వాటిని సంరక్షించుకోవాలన్నదే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం. 'ఏక్ పేడ్ మా కే నామ్' (ఒక్క మొక్క అమ్మ పేరుతో) అనే నినాదంతో ఆయనిచ్చిన పిలుపుకు దేశప్రజలు విశేషంగా స్పందిస్తుండడం గమనార్హం.

### ప్రకృతి పచ్చదనాలే మానవ మనుగడకు ప్రాణాధారాలు :

సమాజంలో ప్రకృతి, పచ్చదనం, పరిశుభ్రత అన్నవి అత్యంత కీలకమైనవి. ఇవే మానవ మనుగడకు జీవనాధారాలు. ప్రజల ఆరోగ్యానికి, ఆయువుకు మూలస్థంభం లాంటి ప్రకృతిని కాపాడుకోవడం ఈ నేలతల్లి కడుపున పుట్టిన వారందరి కర్తవ్యం. చెట్లను కొట్టేయడం, అడవులను నరికేయడం వంటి విధ్వంసాల వల్ల మానవ మనుగడకే తీరని ముప్పు వాటిల్లుతుంది. ముచ్చటగా మూడోసారి ప్రధాని పీఠం అధిష్టించిన మోడీ జూన్ 30న 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ఇదే అంశం పై ప్రసంగించారు. ఆ సందర్భంలోనే అద్భుతమైన ఈ "అమ్మపేరుతో ఒక్క మొక్క కార్యక్రమాన్ని ప్రకటించారు". "నేను మా అమ్మ పేరుతో ఒక్క మొక్క నాటాను. అదేవిధంగా ప్రతిఒక్కరూ తమ తల్లులను గౌరవించేలా ఒక మొక్కను నాటి పెంచండి" అని పిలుపునిచ్చారు.

### అప్పుడు స్వచ్ఛ భారత్... ఇప్పుడు పచ్చ భారత్...!

గతంలో మోడీ ప్రధానిగా తొలిసారి బాధ్యతలు స్వీకరించినప్పుడు కూడా ఇలాంటి అంశంపైనే దృష్టి సారించారు. దేశంలో పెరిగిపోతున్న కాలుష్యాన్ని రూపుమాపేందుకు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు 'స్వచ్ఛభారత్' కార్యక్రమాన్ని ప్రకటించారు. స్వయంగా ప్రధానే చీపురు చేతపట్టి వీధులు ఊడ్చారు. సాగరతీరాల్లో పేరుకుపోతున్న మురికివస్తువులను తానే ఏరిపారేశారు. అప్పటినుండి ఇప్పటికి కూడా దేశమంతా స్వచ్ఛభారత్ కార్యక్రమాలు కొనసాగుతూనే ఉండడం తెలిసిందే.

ఇప్పుడు "పచ్చ భారత్" లక్ష్యంగా ప్రధాని అడుగులు వేస్తున్నారు. ఆ క్రమంలో ఆయన మొదలుపెట్టిన 'అమ్మ పేరుతో ఒక మొక్క' కార్యక్రమానికి దేశవ్యాప్తంగా ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ప్రత్యేకించి 'మీరు కూడా మీ అమ్మ పేరుతో ఒక మొక్కని నాటి, ఆ మొక్కను అమ్మను చూసుకున్నట్లు జాగ్రత్తగా చూసుకుంటారు కదూ'..! అని ప్రధాని ప్రేమగా చెప్పడం దేశప్రజలని బాగా ఆకట్టుకుంది. పెద్దఎత్తున పర్యావరణవేత్తలు, వనసంరక్షకులు, సామాజికసేవకులు, ప్రజలు, పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు అనేకమంది ఆయా ప్రాంతాల్లో మొక్కలు నాటడం ప్రారంభించారు. నెల్లూరు నగరంలో కూడా జిల్లా ఉన్నతాధికారులు, అటవీ, వన సంరక్షణాధికారులు, కేంద్రప్రభుత్వ క్షేత్రప్రచారశాఖ వారు, స్వచ్ఛంధసంస్థల వారు అంతా ఏకమై ఈ కార్యక్రమాన్ని విస్తృతం చేసేందుకు కంకణబద్ధులయ్యారు.

### అమ్మ.. పిల్లలను పెంచినంత మురిపెంగా మొక్కలను పెంచాలి!

'అమ్మ పేరుతో ఓ మొక్క', 'స్వచ్ఛభారత్' వంటి సామాజిక ప్రయోజనం ఉన్న కార్యక్రమాలు ప్రచారార్భాటం కోసం చేసేవి కాదని మనం గ్రహించాలి. ఇది మన చుట్టూ ఉన్న సమాజం కోసం, మన కోసం, మన బిడ్డల భవిష్యత్తు కోసం చేసే ఒక బృహత్తర కార్యక్రమం అని గుర్తించాలి. అందుకే, ఇది నిరంతరం ఒక మెగా ఉద్యమంలా.. మహోద్యమంలా కొనసాగాలి. మొక్కలు నాటి వదిలేస్తే అవి ఎండిపోతాయి. నిత్యం వాటికి నీళ్లందించకపోతే చచ్చిపోతాయి. అలా వదిలేయడం మంచిది కాదు. తన కడుపున పుట్టిన బిడ్డని అమ్మ ఎలా ఆప్యాయంగా, మురిపెంగా పెంచుతుందో అదే తరహాలో మనం నాటిన మొక్క పెరిగి మానయ్యే దాకా వాటినీ మనం సంరక్షించుకోవాలి. అప్పుడే ఈ బృహత్ కార్యక్రమానికి సార్థకత లభిస్తుంది. ప్రధాని పిలుపుతో దేశంలో అనేక చోట్ల పిల్లలు తమ అమ్మలను తీసుకువెళ్ళి మొక్కలు నాటుతున్నారు. విధివశాత్తూ తల్లులను కోల్పోయినవాళ్లు, అమ్మ ఫోటోలు పెట్టుకుని మొక్కలు నాటుతూ ఈ మహోన్నత ఉద్యమానికి ఊపిరి పోస్తున్నారు.

మన పరిసరాలను మనం పరిశుభ్రంగా ఉంచుకోవడం మన బాధ్యత. రంగుల హరివిల్లుతో పాటు పరిమళాలు వెదజల్లే పూల మొక్కలు, రుచికరమైన పళ్ళని అందించే పళ్ళ చెట్లు, చల్లని గాలులతో ఆహ్లాదాన్ని పంచుతూ పదిమందికి నీడని కల్పించే చెట్లు ప్రకృతికి అందాన్ని అందించడంతో పాటు పర్యావరణాన్ని పరిరక్షిస్తాయి. వాటి ద్వారా వచ్చే స్వచ్ఛమైన వాయువు మనకు అందుతుంది. తద్వారా మన ఆయువు పెరుగుతుంది.

"వృక్షో రక్షతి..రక్షిత:" అన్నట్లు వృక్షాలను మనం రక్షిస్తే, అవి మనల్ని రక్షిస్తాయి. కలుషిత వాతావరణం నుండి మనల్ని కాపాడుతాయి. ఎంతో ముందుచూపుతో, మన అమ్మ పేరుతో ప్రధాని ఇచ్చిన పిలుపుకి మనందరం సామాజిక స్పృహతో స్పందించాలి. నైతిక బాధ్యతతో ప్రతిస్పందించాలి. "అమ్మ పేరుతో ఒక్క మొక్క" కార్యక్రమాన్ని విస్తృతస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్ళాలి. వార్తాపత్రికలు, ప్రచార సాధనాలు, ప్రసార మాధ్యమాలు తమవంతు బాధ్యతగా ఈ బృహత్తర, మహత్తర, లోకోత్తర కార్యక్రమానికి చేయూతనందించాలి. కాలుష్యరహిత భారత్‌గా మన దేశాన్ని అవతరింపజేయడానికి ప్రతిఒక్కరూ ప్రతినబూనాలి..!

- రాజశ్రీ

*మత సామరస్యానికి ప్రతీకగా, భక్తులు కోరుకున్న కోర్కెలు తీర్చే మహామహిమాన్వితమైన దర్గాగా ప్రపంచస్థాయిలో పేరొందిన నెల్లూరు బారాషహీద్ దర్గాలో ప్రతిష్ఠాత్మకంగా జరిగే పూజలకు, గంధోత్సవానికి, రొట్టెల పండుగకు భక్తులు లక్షలాదిగా తరలివచ్చారు. సుమారు 10 లక్షల మందికిపైగానే భక్తులు వచ్చారని అంచనా. ఈ నెల 17 నుంచి పెద్దఎత్తున ప్రారంభమైన బారాషహీద్ దర్గా రొట్టెల పండుగ 21వ తేదీ ఆదివారంతో జయప్రదంగా ముగిసింది. ఈ అయిదు రోజులూ నెల్లూరు జనప్రవాహంతో నిండిపోయింది. ఈ సందర్భంగా బారాషహీద్ దర్గా రంగురంగుల విద్యుద్దీపాలతో ధగధగలాడింది. నిరంతర భక్తజన కోలాహలంతో దర్గాప్రాంతమంతా కోలాహలంగా తయారైంది. సుమారు నాలుగువందల ఏళ్లకు పైగానే చరిత్ర ఉన్న బారాషహీదుల దర్గాను దర్శించుకోవడం తమకెంతో ఆనందంగా ఉంటూ భక్తజనం పులకించిపోయారు. రొట్టెల పండుగ సందర్భంగా జిల్లా అధికారయంత్రాంగమంతా భక్తులకు వసతులు కల్పించడం తదితర ఏర్పాట్లల్లో తలమునకలైంది. ఉన్నతాధికారులు, మంత్రులు, నాయకులు, దర్గా నిర్వాహకులు, వక్ఫ్‌బోర్డు వారు, ఫెస్టివల్ కమిటీ ఇలా అందరూ కలసి సమన్వయంతో పనిచేసి ఈ పండుగను జయప్రదం చేశారు. రొట్టెల పండుగను పురస్కరించుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వర్చువల్‌గా భక్తులతో మాట్లాడడం, దర్గా ప్రాశస్త్యాన్ని వివరించడమే కాక, దర్గా అభివృద్ధికి 5 కోట్ల రూపాయలు మంజూరు చేయడం విశేషం.*





# భక్తజన సంద్రంగా మారిన..నెల్లూరు

- **బారా షహీదుల దర్శనానికి బారులు తీరిన భక్తులు**
- **లక్షలాది మంది భక్తులతో.. దిగ్విజయంగా.. రొట్టెల పండుగ**

నెల్లూరులోని బారాషహీద్ దర్గాలో రొట్టెల పండుగ సందర్భంగా తొలిరోజైన బుధవారం నాడే లక్ష మందికి పైగానే భక్తజనం తరలివచ్చారు. ఎక్కడ చూసినా జనమే. కుటుంబాలతో సహా ఎంతెంతో దూరప్రాంతాల నుంచి భక్తులు వాహనాల్లో నెల్లూరు నగరానికి తరలివచ్చారు. రోజు రోజుకు ఆ సంఖ్య భారీగా పెరగడంతో దర్గాప్రాంతమంతా కిటకిటలాడింది. ఈ పండుగ రోజుల్లో అత్యంత పవిత్రమైన బారాషహీద్‌ల దర్శనానికి భక్తులు పెద్ద సంఖ్యలో బారులు తీరారు. గంటల తరబడి నిరీక్షించి మరీ దర్గాను దర్శించుకున్నారు. ఈ వేడుకల్లో భాగంగా, ఈనెల 18న గంధోత్సవం మరెంతో వైభవంగా జరిగింది. మేళతాళాలు, పూలచాందినీలతో, భక్తజనం మధ్య స్థానిక కోటమిట్టలోని అమీనియా మసీదు నుంచి బారా షహీద్ దర్గా వరకు పవిత్రమైన గంధాన్ని ఎంతో భక్తిశ్రద్ధలతో ఊరేగింపుగా తీసుకువచ్చారు. సంప్రదాయబద్ధంగా జరిగిన ఈ

## బారాషహీద్ దర్గా అభివృద్ధికి
# రూ.5 కోట్లు ఇస్తామన్న సీఎం చంద్రబాబు



ప్రఖ్యాత బారాషహీద్ దర్గాలో నిర్వహించే రొట్టెల పండుగను భవిష్యత్తులో అంతర్జాతీయ పండుగగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇటీవల వర్చువల్ మీటింగ్‌లో హామీ ఇచ్చారు. దర్గాలో... రొట్టెల పండుగ ఏర్పాట్లు సమీక్షించి, పండుగకు వచ్చిన భక్తులతో సీఎం చంద్రబాబు వర్చువల్‌గా మాట్లాడారు. రొట్టెల పండగ విశేషాలను, వారి అభిప్రాయాలను భక్తులతో మాట్లాడి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా, దర్గా అభివృద్ధికి రూ.5 కోట్లను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించడమే కాక, రొట్టెల పండుగను భవిష్యత్తులో అంతర్జాతీయ పండుగగా నిర్వహించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి, టీడీపీ పార్లమెంట్ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమాలను తిలకించడానికి భక్తులు వేలసంఖ్యలో వచ్చారు. కడప పెద్ద దర్గా పీఠాధిపతి ఆరీఫుల్లా హుస్సేని ఆధ్వర్యంలో ముజావర్లు, ఫకీర్ల ప్రత్యేక ప్రార్థనల తర్వాత ఆ గంధాన్ని అమరవీరుల మజహర్లపై లేపనం చేశారు. అనంతరం గంధాన్ని భక్తులకు పంచిపెట్టారు. మతపెద్దలు, దర్గా నిర్వాహకులు, స్థానిక రాజకీయ ప్రముఖులు, ముఖ్య నేతలందరి పర్యవేక్షణలో గంధోత్సవం వైభవోపేతంగా జరిగింది. అనంతరం రొట్టెల పండుగ సందర్భంగా భక్తులు తమ కోర్కెలు తీరాలంటూ చెంతనే ఉన్న స్వర్ణాల చెరువులో దిగి కోర్కెలు నెరవేరిన భక్తుల నుంచి రొట్టెలను అందిపుచ్చుకున్నారు. పెళ్లిరొట్టె, సంతానం రొట్టె, చదువు రొట్టె, ఉద్యోగ రొట్టె, ఆరోగ్య రొట్టె. ఇలా భక్తులు తమ కోర్కెల మేరకు స్వర్ణాల చెరువులో దిగి, ఆ కోర్కెలు తీరిన భక్తుల నుంచి రొట్టెలను అందుకున్నారు. తమ కోర్కెలు తీరితే మళ్ళీ దర్గాకు వచ్చి మొక్కులు తీర్చుకుంటామని మొక్కుకున్నారు. ఈ అయిదు రోజులూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జిల్లా పోలీసు యంత్రాంగం నిర్విరామంగా కృషిచేసింది. వేలాదిమంది పోలీసులతో భారీ బందో బస్తు ఏర్పాటుచేసి భక్తులకు దర్గా దర్శనభాగ్యానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చేశారు.

## రొట్టెలపండుగలో వేమిరెడ్డి దంపతులు



రొట్టెల పండుగ వేడుకల్లో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి..కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొని రొట్టెలు పట్టుకున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాలనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి సాధించాలని, అదేవిధంగా జిల్లా అన్ని రంగాల్లో ముందుండాలని ఆకాంక్షిస్తూ రొట్టెలను పట్టుకోవడం విశేషం. అదేవిధంగా మంత్రి నారాయణ, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షులు అబ్దుల్ అజీజ్‌తో కలసి రొట్టెలపండుగలో రొట్టెలు పట్టుకున్నారు. ఈ సందర్భంగా, బారాషహీద్ దర్గాకు చేరుకున్న వేమిరెడ్డి దంపతులకు దర్గా కమిటీ సభ్యులు సాదర స్వాగతం పలికారు. అనంతరం రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డితో కలసి వారంతా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పార్టీ

## ప్రముఖుల ప్రత్యేక ప్రార్థనలు

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, తాళ్లపాక అనురాధ, మాజీ మేయర్ భానుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి నారాయణ విలేకర్లతో మాట్లాడుతూ... బారాషహీద్ దర్గా రొట్టెల పండుగకు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా భక్తులు భారీగా తరలిరావడం ఆనందంగా ఉందన్నారు. దర్గా అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 5 కోట్ల రూపాయలను విడుదల చేస్తూ ఆదేశాలు జారీ చేయడం విశేషమని అన్నారు. ఈ సందర్భంగా దర్గా కమిటీ, ప్రజలు, భక్తుల తరపున సీఎం చంద్రబాబుకి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నానని పేర్కొన్నారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ... రొట్టెల పండుగ సందర్భంగా బారా షహీద్‌లను దర్శించుకోవడం సంతోషంగా ఉందని, దర్గా ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు.

# సీనియర్ నేత.. 'చెలికం' కన్నుమూత



వెంకటగిరి నియోజకవర్గంలో సుదీర్ఘకాలం రాజకీయాల్లో ఉన్న సీనియర్ నేత, ఆర్టీసీ విక్రమసింహపురి రీజియన్ మాజీ ఛైర్మన్ చెలికం శంకరరెడ్డి ఈనెల 19వ తేదీ తెల్లవారుజామున కన్నుమూశారు. ఆయన వయస్సు 87 సంవత్సరాలు. వృద్ధాప్యంతో ఆయన డక్కిలి మండలం మాధవాయపాళెంలోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. వెంకటగిరి సమితి అధ్యక్షునిగా, వెంకటగిరి రాజాల వర్గీయునిగా ఉంటూ, ఏళ్ళతరబడిగా ఆయన నియోజకవర్గ ప్రజలకు సేవలందించారు. మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డికి కుడిభుజంగా ఉంటూ జిల్లా రాజకీయాల్లో కూడా ఆయన కీలకపాత్ర పోషించారు. ఆ తర్వాత, 2007లో టీడీపీలో చేరి, వెంకటగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు చేపట్టి తెలుగుదేశం పార్టీని బలోపేతం చేశారు. ఆయన మరణవార్త తెలియగానే నియోజకవర్గ ప్రజలే కాక, జిల్లాలోని వివిధ పార్టీల నాయకులు, పార్టీలకతీతంగా వచ్చి ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. సర్వేపల్లి ఎమ్మెల్యే..మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, వైకాపా నేత నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, నాయకులు గంగోటి నాగేశ్వరరావు, దొంతు శారద, పులికొల్లు రాజేశ్వరరావు తదితరులు ఆయన కుటుంబానికి సంతాపం ప్రకటించారు.

## నేషనల్ స్కాలర్‌షిప్‌కు
# దరఖాస్తు చేసుకోండి

2024-25 విద్యా సంవత్సరానికి కేంద్రప్రభుత్వం జిల్లాలోని 9, 10 తరగతుల విద్యార్థులకు, ఇంటర్, ఆ తర్వాత ఉన్నత విద్యలభ్యసించే విద్యార్థులకు నేషనల్ స్కాలర్‌షిప్ మంజూరుచేయనుందని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమశాఖ జిల్లా సహాయ సంచాలకులు ఎం.వినయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ కోసం అక్టోబర్ 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హులైన దివ్యాంగ విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# విధి నిర్వహణలో.. దినేష్.. భేష్!

## దక్షిణమధ్య రైల్వే జీఎం నుంచి అవార్డు




రైళ్ళ రాకపోకల పట్ల ఎంత జాగ్రత్తగా ఉండాలో దినేష్ నిరూపించాడు. తమ పరిధిలోని రైళ్ళ రాకపోకలను ఏమాత్రం ఏమరుపాటు లేకుండా గమనించే దినేష్, గత నెల 26న బిట్రగుంట-అల్లూరురోడ్డు మధ్య ఎల్‌సీ నం.143-టీలో గూడ్స్‌రైలు లోకో నుంచి 24వ వ్యాగన్ చక్రం కదలకపోవడాన్ని చూశాడు. వెంటనే ఆ విషయాన్ని బిట్రగుంటలోని డ్యూటీ స్టేషన్‌మాస్టర్‌కు తెలియజేయడం, దీంతో అప్రమత్తమైన రైల్వే సిబ్బంది హుటాహుటిన రైలును ఆపేసి, చకచకా మరమ్మతులు చేయడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లయింది. దీంతో, విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండే ఉద్యోగులకు రైల్వేశాఖ బహుకరించే 'ఎంప్లాయి ఆఫ్ ది మంత్ సేఫ్టీ అవార్డు' దినేష్‌ను వరించింది. దేశవ్యాప్తంగా అన్ని డివిజన్లలో 9మందికి జూన్ నెలకు గాను ఈ అవార్డులు ప్రకటించగా, వాటిలో నెల్లూరుజిల్లా కొమ్మరపూడి రైల్వేస్టేషన్‌లో అసిస్టెంట్ పాయింట్‌మెన్‌గా పనిచేస్తున్న దినేష్‌కు అవార్డు రావడం విశేషం. ఈనెల 22న సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో జరిగిన కార్యక్రమంలో దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ చేతుల మీదుగా దినేష్ ఆ అవార్డును అందుకున్నారు.

# నెల్లూరు కబుర్లు

## భారీ వర్షాలతో జాగ్రత్త - కలెక్టర్ ఆనంద్



జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, ప్రజలు కష్టనష్టాల పాలవకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ చెప్పారు. ఈనెల 22న ఆయన నెల్లూరు కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశమై ముందస్తు జాగ్రత్తలపై సమీక్షించారు. నీటిపారుదల, పంచాయతిరాజ్, రెవెన్యూ, విద్యుత్‌శాఖలు అప్రమత్తంగా ఉండాలన్నారు. చెరువుల స్థితిగతులను పరిశీలించి అవసరమైన చోట్ల కట్టలకు మరమ్మతులు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## ప్రజలకు న్యాయం చేయండి

**--- పోలీసులకు జిల్లా ఎస్పీ ఆదేశం ---**

ప్రజల ఫిర్యాదులను పరిష్కరించేందుకు పోలీసు అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశించారు. ఈనెల 22న ఆయన నెల్లూరు నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదులను పరిశీలించారు. మొత్తం 63 ఫిర్యాదులందగా, వాటిని జిల్లా ఎస్పీ స్వయంగా పరిశీలించి, బాధితులను వివరాలడిగి తెలుసుకున్నారు. వాటిపై విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఏఎస్పీ ఏవీ ఆర్‌పీబీ ప్రసాద్, ట్రాఫిక్ డీఎస్పీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


## నెల్లూరు మ్యూజియంను అభివృద్ధి చేస్తాం

**పురావస్తు శాఖ కమిషనర్ వాణీమోహన్**

నెల్లూరు నగరంలోని కెవిఆర్ పెట్రోల్ బంకు సమీపంలో ఉన్న మ్యూజియంను రాష్ట్ర పురావస్తు శాఖ కమిషనర్ జి.వాణీమోహన్ ఈనెల 23న సందర్శించారు. అందులోని పురావస్తు సంపదను పరిశీలించి వివరాలడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలోని పురావస్తు శాలలను ఆధునీకరించి, భావితరాలకు వారసత్వ సంపదగా అందించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోందని, అందులో భాగంగా విజయవాడ, అనంతపురం పురావస్తు శాలల ఆధునీకరణ జరిగిందని ఆమె తెలిపారు. నెల్లూరు పురావస్తు శాల (మ్యూజియం)ను కూడా అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తామని, ఈ మ్యూజియంను ఆధునికరించేందుకు తగు ప్రతిపాదనలను పంపాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం ఆమె నెల్లూరులోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ తల్పగిరి రంగనాథ స్వామి దేవాలయాన్ని సందర్శించి, ప్రత్యేకపూజలు చేశారు. ఆమెకు ఆలయ నిర్వాహకులు సాదరస్వాగతం పలికారు. ఆమె వెంట పురావస్తు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ గంగాధర్, జిల్లా దేవాదాయశాఖ సహాయ కమిషనర్ జె.శ్రీనివాసరావు, కార్యనిర్వహణాధికారి ఏ.వి శ్రీనివాసులురెడ్డి, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.





## విద్యార్థి చదువుకు.. ప్రశాంతిరెడ్డి సాయం

నెల్లూరులోని 'విపిఆర్ విద్య' పాఠశాలలో 10వ తరగతిలో 580 మార్కులు సాధించి స్కూల్ టాపర్‌గా ప్రతిభ చాటిన ఉదయగిరి లక్ష్మీచరణ్ అనే విద్యార్థికి ఆ స్కూల్ కరెస్పాండెంట్..ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సతీమణి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఇటీవల 30వేల రూపాయలు సాయం అందజేశారు. ప్రస్తుతం నారాయణ విద్యాసంస్థల్లో జూనియర్ ఇంటర్మీడియట్ (ఎంపీసీ) చదువుతున్న ఆ విద్యార్థి తండ్రి ఉదయగిరి సురేష్ నెల్లూరులో హోంగార్డ్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఎందరో నిరుపేద విద్యార్థులు తమ కలలను సాకారం చేసుకునేందుకు వారధిగా నిలుస్తున్న విపిఆర్ ఫౌండేషన్ ప్రతిభ మరియు పేదరికమే అర్హతగా ఉచిత విద్య అందిస్తుండడం అందరికీ తెలిసిందే. 'విపిఆర్ విద్య'స్కూల్‌లో 6 నుంచి 10వ తరగతి వరకు చదువుకున్న లక్ష్మీచరణ్ 10 తరగతిలో స్కూల్ టాపర్‌గా నిలిచాడు. తమ స్కూల్‌లో అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థినీ విద్యార్థుల ఉన్నత చదువుల ఖర్చు తామే భరిస్తానని ప్రకటించిన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి... ఆ విద్యార్థికి ఆమేరకు ఆర్థిక సహాయం చేసి మాట నిలుపుకొన్నారు.

## సాయిదర్బార్‌లో గురుపూర్ణిమ వేడుకలు



గురుపూర్ణిమను పురస్కరించుకుని నెల్లూరు నగరంలోని శ్రీ సాయిబాబా మందిరాల్లో ఈనెల 21న సాయినాథునికి విశేషపూజలు జరిగాయి. బాలాజీనగర్ సమీపంలోని పద్మావతినగర్‌లో ఉన్న సాయిదర్బార్ అద్దాల మందిరంలో స్వామి వారిని కన్నులపండువగా అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు చేసి, హారతులిచ్చారు. అఖండ సాయినామ సంకీర్తన, విష్ణు సహస్రనామ పారాయణాలతో పాటు, పల్లకి ఉత్సవం, ఊంజల్‌సేవ, పవళింపు సేవలను వైభవంగా నిర్వహించారు. మందిరం మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి, గౌరవ సలహాదారు పాబోలు రామసుబ్బయ్య, స్వామి వారి భక్తబృందం పర్యవేక్షించారు.

## కథాసంపుటి ఆవిష్కరణ



ప్రముఖ రచయిత్రి సందడి అరుణ రచించిన 'చిగురించిన చిరునవ్వు' కథ సంపుటిని ఈనెల 21న నెల్లూరు పురమందిరంలోని ఏసీ హాల్‌లో ఆవిష్కరించారు. నెల్లూరుజిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పద్యకళాపరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్రప్రసాద్ చేతులమీదుగా ఆ పుస్తకాన్ని ఆవిష్కరించారు. నెరసం అధ్యక్షుడు ఏ.జయప్రకాష్ అధ్యక్షత వహించిన ఈ సభలో విశ్రాంత ఓయస్డీ పెంచలరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్‌రాజ, డాక్టర్ పెళ్ళకూరు జయప్రద, పాతూరి అన్నపూర్ణ, చిన్ని నారాయణరావు, నలుబోలు బలరామయ్యనాయుడు, వడలి రాధాకృష్ణ, ఈతకోట సుబ్బారావు పాల్గొని రచయిత్రిని అభినందించారు.

### గొర్రెల యూనిట్ల మాయంపై..

## విచారణ చేయించండి

ఉపాధి పథకం కింద గతంలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా ఒక్కో మండలానికి 50 గొర్రెల యూనిట్ల వంతున మంజూరు చేశారని, అయితే అవి లబ్దిదారులకు చేరినట్లు దాఖలాలు లేవని, ఆ యూనిట్లు ఏమైపోయాయో విచారణ జరిపించాలని సీపీఐ నాయకుడు వాటంబేటి నాగేంద్ర ఇటీవల జిల్లా కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం అందజేశారు. రాపూరు మండలానికి మంజూరైన యూనిట్లు ఇద్దరికి మాత్రమే ఇచ్చి, మిగతావారి యూనిట్ల డబ్బును స్వాహా చేశారని ఆయన ఆరోపించారు.

## కార్పొరేషన్ కమిషనర్‌గా..సూర్యతేజ



నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్‌గా ఏలూరు జిల్లా కెఆర్ పురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా పనిచేస్తున్న మల్లవరపు సూర్యతేజ నియమితులయ్యారు. ఈ నెల 24న ఆయన బాధ్యతలు స్వీకరించి జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. 2020 ఐఏఎస్ బ్యాచ్‌కి చెందిన సూర్యతేజ గతంలో పశ్చిమగోదావరి జిల్లాలో సబ్‌కలెక్టర్‌గా కూడా పనిచేశారు. ఆయన నియామకంతో నెల్లూరు నగరపాలక సంస్థ గాడిన పడుతుందని అందరూ ఆశిస్తున్నారు. కొత్త కమిషనర్‌కు 'లాయర్' శుభాకాంక్షలు.

## జేసీ సేతుమాధవన్ బదిలీ

నెల్లూరుజిల్లా జాయింట్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న సేతు మాధవన్‌ను పార్వతీపురంలోని ఐటీడీఏ ప్రాజెక్టు డైరెక్టర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 20న ఆదేశాలు జారీ చేసింది. గత మార్చి 8న ఆయన జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. నాలుగు నెలలకే బదిలీ అయ్యారు. ఇటీవల జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు సజావుగా జరిగేలా ఆయన తనవంతు కృషి చేశారు. ప్రభుత్వం మారడంతో ఆయన్ను బదిలీచేసినట్లు సమాచారం.

## కార్పొరేషన్ ఆరోగ్యాధికారిగా..చైతన్యరెడ్డి

నెల్లూరు నగరపాలక సంస్థ ఆరోగ్యశాఖ అధికారిగా చైతన్యరెడ్డిని నియమిస్తూ, ఈనెల 23న రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ ఉత్తర్వులిచ్చింది. ముత్తుకూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యాధికారిగా ఉన్న చైతన్యరెడ్డి డెప్యుటేషన్‌పై నగరపాలక సంస్థ ఆరోగ్యాధికారిగా బాధ్యతలు చేపట్టనున్నారు.

## శాకంబరిగా..శ్రీ రాజరాజేశ్వరిదేవి



నెల్లూరు, దర్గామిట్టలో కొలువై ఉన్న శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయంలో ఆషాడమాసం సందర్భంగా అమ్మవారికి ఇటీవల శాకంబరి అలంకారం చేసి పూజలు నిర్వహించారు. అనేక రకాల కూరగాయలు, పూలు-పండ్లతో శోభాయమానంగా నిర్వహించిన ఈ అలంకారంలో అమ్మవారు కన్నులపండువగా దర్శనమిచ్చారు. కొలపర్తి వెంకటరమేష్ కుమార్, సువర్ణలక్ష్మిలు ఉభయకర్తలుగా వ్యవహరించారు. పెద్దసంఖ్యలో భక్తులు, ముఖ్యంగా మహిళాభక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ సహాయ కమిషనర్ జె.వెంకటసుబ్బయ్య, వ్యవస్థాపక ధర్మకర్త రత్నం జయరామ్, ఆలయ ప్రధాన అర్చకులు ఎస్ రఘురామమూర్తి, ఏ.వీ రామకృష్ణశర్మ, వేదపండితులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## బయ్యా వెంకటరమణయ్య జయంతి



నెల్లూరులోని శుభమస్తు షాపింగ్‌మాల్, న్యూ రాజ్యలక్ష్మిహోటల్ వ్యవస్థాపకుడు బయ్యా వెంకటరమణయ్య 82వ జయంతి ఈనెల 21న స్థానిక పురమందిరంలో ఏవీకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగింది. బయ్యా వెంకటరమణయ్య సేవలను ఈ సందర్భంగా వక్తలు కొనియాడారు. అనంతరం నూర్‌బాషా ముస్లిం సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కాలేషా, ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణయ్య..నృత్యగురువు దేగల సాంబశివరావులను నిర్వాహకులు సన్మానించారు. కేతా సుబ్బారావు ఆధ్వర్యంలో పాటలు, శాస్త్రీయ నృత్య పోటీలు జరిగాయి. శుభమస్తు షాపింగ్‌మాల్ నిర్వాహకులు బయ్యా శ్రీనివాసులు, బయ్యా రవికుమార్‌ల సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రపంచ తెలుగు సమాఖ్య రీజనల్ ఛైర్మెన్ నలుబోలు బలరామయ్యనాయుడు, పద్యకళా పరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్, రియాజ్‌బాషా, దగ్గుపాటి రాధాకృష్ణ పాల్గొన్నారు.

# కేంద్రమంత్రులతో.. విపిఆర్ వరుస భేటీలు

## జిల్లాలో జాతీయ రహదారులపై నితిన్ గడ్కరీతో చర్చ



నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (విపిఆర్) ఢిల్లీలో పలువురు కేంద్రమంత్రులను కలిసి, జిల్లాకు సంబంధించిన అనేక అభివృద్ధి విషయాలను చర్చిస్తున్నారు. లోక్‌సభ సమావేశాల సందర్భంగా ఆయన ఢిల్లీ వెళ్ళినప్పటికీ, అటు ఆ సమావేశాల్లో పాల్గొంటూనే మరోవైపు, ఏమాత్రం సమయాన్ని వృథా చేయకుండా అందుబాటులో ఉన్న కేంద్రమంత్రులను కలిసి జిల్లా అభివృద్ధికి తగు సహకారాన్ని కోరుతున్నారు. ఇటీవల కేంద్ర రోడ్డు రవాణా మరియు రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని విపిఆర్ మర్యాదపూర్వకంగా కలిసి ఆయన్ను శాలువతో సన్మానించారు. అనంతరం ఆయనతో మాట్లాడుతూ, నెల్లూరుజిల్లా పరిధిలో జాతీయ రహదారుల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను కేంద్రమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. జాతీయ రహదారులకు సంబంధించిన పెండింగ్ పనులు, నిర్మించాల్సిన ఫ్లైఓవర్లు, జాతీయ రహదారుల విస్తరణకు సంబంధించిన విషయాలను విపిఆర్ నితిన్ గడ్కరీతో చర్చించారు. ఆ మేరకు వినతిపత్రాన్ని కూడా కేంద్రమంత్రికి అందజేశారు. విపిఆర్ చెప్పిన అంశాలన్నిటికీ కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించి, ఆయా అంశాల పరిష్కారానికి కృషిచేస్తామని హామీ ఇచ్చారు.

### కార్మిక మంత్రి మాండవీయతో...

అదేవిధంగా, కేంద్ర కార్మిక మరియు ఉపాధి శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయతో విపిఆర్ భేటీ అయ్యారు. నెల్లూరుజిల్లా పరిధిలో అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమం, వారికి సంబంధించిన పథకాలు తదితర అంశాలను ప్రస్తావించారు. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్ యోజన, ప్రధాన్‌మంత్రి ఆవాస్ యోజన, గరీబ్ కల్యాణ్ రోజ్‌గార్ అభియాన్, పీఎం స్వానిధి వంటి పథకాలపై కేంద్రమంత్రితో విపిఆర్ చర్చించారు.

### పంచాయత్‌రాజ్ సహాయమంత్రి పెమ్మసానితో ...

నెల్లూరు జిల్లాలో పంచాయత్ రాజ్ శాఖ పరిధిలోని చాలా రోడ్లు గత ఐదేళ్లుగా ఎలాంటి నిర్వహణ లేక తీవ్రంగా దెబ్బతిన్నాయని విపిఆర్ ఇటీవల ఢిల్లీలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ దృష్టికి తీసుకువెళ్లారు. రహదారుల నిర్వహణ పనులు చేపట్టకపోవడంతో రోడ్లు దెబ్బతిన్నాయని, దాంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులైన వరి, మొక్కజొన్న, హార్టికల్చర్, ఆక్వాకల్చర్ మరియు సముద్ర ఉత్పత్తులను మార్కెట్ కేంద్రాలకు రవాణా చేయడానికి గ్రామీణ రహదారులు చాలా ఉపయోగపడతాయని, అలాంటి రహదారులను బాగు చేసి జిల్లా ప్రజల అవస్థలను తొలగించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా కోవూరు నియోజకవర్గంలో ఉన్న గ్రామీణ రహదారులు తీర ప్రాంత గ్రామాలకు రవాణా సదుపాయాన్ని అందిస్తాయని, అనేక గ్రామాలు సముద్ర తీరాన్ని ఆనుకుని ఉన్నందున, తుఫానుల సమయంలో ఆ రహదారులు చాలా ఉపయోగపడతాయని, కాబట్టి గ్రామీణ ప్రాంత రహదారులను బాగు చేసి అటు జిల్లాలోను, ఇటు ప్రత్యేకించి కోవూరు నియోజకవర్గంలోనూ ప్రజల ఇబ్బందులు తొలగించాలని కోరారు. అందుకు సానుకూలంగా స్పందించిన మంత్రి, రహదారుల బాగుకు తప్పకుండా చర్యలు తీసుకుంటామని విపిఆర్‌కు హామీ ఇచ్చారు.



## నెల్లూరులో ఘనంగా...

# ప్రారంభమైన వన మహోత్సవం

- ప్రభుత్వ పాఠశాలల్లో 'అమ్మ పేరిట ఒక మొక్క'
- మొక్కల పెంపకం పట్ల విద్యార్థుల ఉత్సాహం

పర్యావరణ పరిరక్షణకు, ప్రకృతిని-పచ్చదనాన్ని కాపాడుకునేందుకు ప్రధాని నరేంద్ర మోడీ స్ఫూర్తితో, భారత ప్రభుత్వ సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, నెల్లూరు క్షేత్ర కార్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 24న వన మహోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. నెల్లూరు రంగనాయకులపేటలోని పిఎంఆర్ మున్సిపల్ హైస్కూల్ నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి, నవాబుపేటలోని ఎంసిహెచ్ఎస్ ప్రతి వారి పాఠశాల, పప్పుల వీధిలోని వైవిఎంసిహెచ్ స్కూల్ (సత్రం బడి)లోనూ విద్యార్థులతో కలిసి ఉత్సాహంగా మొక్కలను నాటారు. ఆసక్తి గల విద్యార్థులకు వారు కోరిన మొక్కలను అందజేశారు. స్థానిక 'వారధి ఫౌండేషన్' ఈ కార్యక్రమంలో మొక్కల సంరక్షణకు సహకరిస్తున్నారు. 'శుభమస్తు షాపింగ్ మాల్, పెరుమాళ్ సిల్క్స్ వారు ఈ ప్రజోపయోగకరమైన కార్యక్రమానికి తమ సహకారాన్ని అందిస్తున్నారు. అదేవిధంగా, 'లాయర్' పత్రిక, యాక్ట్ ఛానల్, రెడ్ ఎఫ్.ఎం.లు మీడియా పార్టనర్‌లుగా వ్యవహరిస్తుండడం విశేషం.

### రానున్న నెలరోజుల్లో.. భారీస్థాయిలో మొక్కలు :

సామాజిక వనవిభాగం, నెల్లూరు డివిజన్ వారి సహకారంతో రానున్న నెలరోజుల్లో వందలాది మొక్కలను నెల్లూరు నగరంలోని అన్ని పాఠశాలల్లో నాటుతామని భారత ప్రభుత్వ క్షేత్ర ప్రచార అధికారి పరవస్తు నాగసాయి సూరి ఈ సందర్భంగా చెప్పారు. విద్యార్థులు అవకాశం ఉన్న వారి ఇంటి ఆవరణల్లోనూ మొక్కలు పెంచేందుకు ఆసక్తి వ్యక్తం చేస్తున్నారని, పాఠశాలల్లో మొక్కలు నాటడమే కాకుండా, ప్రతి తరగతికి ఒక మొక్క సంరక్షణ బాధ్యతలను అప్పగించటంతో పాటు, మొక్కలు బాగా పెరిగే దాకా వారధి ఫౌండేషన్ పర్యవేక్షిస్తుందని ఆ సంస్థ చైర్మన్ శ్రీరంగనాథ్, కార్యదర్శి ఆర్నాట్ శ్రీనివాసులు తెలిపారు. మూడు పాఠశాలల్లో జరిగిన ఈ కార్యక్రమాల్లో పాఠశాల ప్రధానోపాధ్యాయులతో పాటు అధ్యాపకులు, పెద్దసంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## మన సతీష్‌రెడ్డికి..

# 'తెలుగు వైభవ పురస్కారం'



ప్రపంచ తెలుగు మహాసభల నిర్వహణ ద్వారా విశ్వవ్యాప్తంగా ఉన్న తెలుగు వారిని ఒకే వేదిక మీదకు తెచ్చిన 'తెలుగు జాతి రత్నం' మండలి వెంకటకృష్ణారావు స్మారకంగా ప్రదానం చేసే'తెలుగు వైభవ పురస్కారం'ను ఈసారి భారత రక్షణ మంత్రి సలహాదారు, డీఆర్‌డీఓ మాజీ చైర్మన్, మన సింహపురీయులు డాక్టర్ జి.సతీష్‌రెడ్డికి ప్రదానం చేయనున్నారు. ఆగస్ట్ 4వతేదీన అవనిగడ్డ గాంధీ క్షేత్రంలో మండలి వెంకటకృష్ణారావు 99వ జయంతి సందర్భంగా, సతీష్‌రెడ్డికి ఆ విశిష్ట పురస్కారాన్ని అందజేయనున్నట్లు మండలి ఫౌండేషన్ అధ్యక్షులు, శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ తెలియజేశారు.



## 'జియ్యర్ ట్రస్టు' ఆధ్వర్యంలో..

# ఆధ్యాత్మిక కార్యక్రమాలు

- పెద్దసంఖ్యలో పాల్గొన్న విద్యార్థులు

శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జియ్యర్‌స్వామి మంగళాశాసనాలతో, శ్రీసిటీ వారి సహాయ సహకారాలతో ఇటీవల చెన్నైలోని జియ్యర్‌ఎడ్యుకేషనల్ ట్రస్టు వారు ఆ సంస్థ 30వ వార్షికోత్సవం సందర్భంగా ఆధ్యాత్మిక పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో బాలలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. చెన్నైలోని వాణీమహల్ వేదికగా జరిగిన భజన పోటీల్లో 25 గ్రూపులు పాల్గొన్నాయి. వారిని జూనియర్, సీనియర్ గ్రూపులుగా విభజించి పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాల్లో నిలిచిన విజేతలకు నిర్వాహకులు బహుమతులందజేశారు. అదేవిధంగా, వివిధ ఆధ్యాత్మిక అంశాల్లో నిర్వహించిన క్విజ్, చిత్రలేఖనం తదితర పోటీల్లో ఎంతో ఉత్సాహంగా దాదాపు 1200 మంది విద్యార్థులు పాల్గొనడం విశేషం. ఇలాంటి కార్యక్రమాలు బాలల్లో నైతిక విలువలను పెంచేందుకు దోహదం చేస్తాయని జియ్యర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ అధ్యక్షుడు రవీంద్ర కుమార్‌రెడ్డి ఈ సందర్భంగా చెప్పారు. ఈ కార్యక్రమాల్లో శ్రీశ్రీశ్రీ త్రిదండి అహోబిల స్వామీజీ కూడా పాల్గొని విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారని, నిర్వాహకులకు ఆశీస్సులందజేశారని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాలకు శ్రీసిటీతో పాటు గోపురం సంస్థ, విపిఆర్ సంస్థ, నాయుడుహాల్, తదితర ట్రస్టుల వారు సహాయ సహకారాలందించారంటూ, వారికి తమ సంస్థ తరపున ధన్యవాదాలు తెలిపారు.

# రాష్ట్రానికి వరాల జల్లు కురిపించిన.. కేంద్ర బడ్జెట్

## కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి హర్షం



కేంద్ర బడ్జెట్లో ఆంధ్రప్రదేశ్‌కు వరాల జల్లు కురిపించడం హర్షణీయమని, ఇదంతా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి కృషివల్లే సాధ్యమైందంటూ కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. విభజన చట్టంలో పేర్కొన్న అన్ని అంశాలను అమలు చేస్తామని, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించడం, బడ్జెట్లో ఏపీ రాజధాని అమరావతి అభివృద్ధికి రూ. 15వేల కోట్ల రూపాయలు కేటాయించనున్నట్లు ప్రకటించడం స్ఫూర్తిదాయకమన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తిచేయడానికి సహాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకు రావడమేకాక, రాష్ట్రానికి బడ్జెట్లో ప్రత్యేక స్థానాన్ని కల్పించడం ప్రధాని నరేంద్రమోడీ ప్రజాపాలనకు నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీకి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు.



## 'పరిశోధన దారిలో'.. వ్యాస సంకలనం ఆవిష్కరణ



గూడూరు డిఆర్‌డబ్ల్యు కళాశాల విశ్రాంత అధ్యాపకురాలు, ప్రముఖ రచయిత్రి, అభ్యుదయభావాలు కలిగిన డా. లక్ష్మీసుహాసిని తన సారస్వత పరిశోధనల్లో భాగంగా ఇటీవల రచించిన 'పరిశోధనా దారిలో' వ్యాసాల సంకలనం ఆవిష్కరణోత్సవం ఈనెల 20న నెల్లూరు భక్తవత్సల నగర్‌లో ఘనంగా జరిగింది. రచయిత్రి మనుమరాలిచేత ఆ పుస్తకాన్ని ఆవిష్కరింపజేశారు. రచయిత్రి మాట్లాడుతూ, తన పరిశోధనల అనుభవాలను భావితరాలకు ఉపయోగపడేలా వ్యాసాల సంకలనంగా రూపొందించినట్లు చెప్పారు. ప్రముఖ రచయిత్రులు చంద్రలత, ఎస్.గాయత్రి, చేజర్ల వినయ, సందడి అరుణ, తోట సులోచన, నజ్మా, భారతి, అమీరా, స్పందన, డీకేడబ్ల్యు కాలేజీ ఉపన్యాసకురాలు కరుణశ్రీ పాల్గొన్నారు.

## శ్రీసిటీలో..27న ఆధ్యాత్మిక ప్రవచనం



శ్రీసిటీ ఆధ్యాత్మిక సాహిత్య వేదిక 'శ్రీవాణి' ఆధ్వర్యంలో ఈనెల 27వ తేది ఆధ్యాత్మిక ప్రవచనం కార్యక్రమం జరుగుతుంది. పోతన భాగవతంలోని అద్భుత ఘట్టమైన 'గజేంద్ర మోక్షం' గురించి బ్రహ్మశ్రీ కోట రాజశేఖర్ వివరిస్తారు. ఆరోజు ఉదయం 11 గంటలకు శ్రీసిటీలోని బిజినెస్ సెంటర్‌లో జరిగే ఈ కార్యక్రమానికి అందరూ విచ్చేసి జయప్రదం చేయాలని నిర్వాహకులు ఒక ప్రకటనలో కోరారు.

# తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

## 22 కేజీల గంజాయి పట్టివేత



గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురిని అరెస్టు చేసిన సంఘటన గూడూరు జాతీయ రహదారి పోటుపాలెం జంక్షన్ వద్ద చోటు చేసుకుంది. ఈ నెల 20వ తేదీ గూడూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన ముగ్గురు వ్యక్తులు ఒడిస్సా రాష్ట్రంలో గంజాయిని కొనుగోలు చేసి, ఒడిస్సా నుండి గూడూరుకి రైలులో వచ్చి గూడూరు రైల్వేస్టేషన్‌లో దిగారు. అక్కడి నుండి చెన్నైకి వెళ్లేందుకు ఆటోలో గూడూరు జాతీయ రహదారి కూడలికి చేరుకున్నారని, వాహనాల సాధారణ తనిఖీల్లో భాగంగా వారిని గూడూరు రూరల్ పోలీసులు పట్టుకున్నారని తెలిపారు. వారి వద్ద 22కేజీల గంజాయి, 3 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామని, గంజాయి విలువ 2 లక్షల 50వేల రూపాయలు ఉంటుందని చెప్పారు. ఎవరైనా గంజాయి విక్రయించినా, తరలించినా వారిపై చట్టపరమైన చర్యలు చేపడతామన్నారు. గూడూరు రూరల్ సీఐ వేణుగోపాల్‌రెడ్డి, ఎస్.ఐ మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సరస్వతీ శిశు మందిరంలో వ్యాస పౌర్ణమి




గురు పౌర్ణమి (వ్యాస పౌర్ణమి) సందర్భంగా గూడూరులోని శ్రీ సరస్వతీ శిశు మందిరం పాఠశాలలో విశ్రాంత ఉపాధ్యాయులు బి.వెంకటరమణారెడ్డిని ఘనంగా సన్మానించారు. పాఠశాల అధ్యక్షులు మల్లెమాల మురళీరెడ్డి, సహ కార్యదర్శి మయూరి శ్యామ్‌యాదవ్‌లు ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యాస భగవానుని విశిష్టతను వివరించారు. పాఠశాల సమితి సహకార్యదర్శి యస్.వి.యల్. ప్రసాద్, సిహెచ్ వెంకటరమణయ్య, ఆర్.రవిచంద్రారెడ్డి, రూపేష్‌రెడ్డి ఆర్.వి.రావు, ప్రధానాచార్యులు వి.రంగ నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## మానవీయ కథల సమాహారం.. 'పడమటి సూర్యోదయం'

అవ్వారు శ్రీధర్‌బాబు వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు, ప్రవృత్తి రీత్యా కవి, కథకుడునూ. వివిధ సాహితీ సంస్థల్లో పలు పదవుల్లో తెలుగు భాషా సాహిత్యాలకు సేవలందిస్తున్నారు. ఇప్పటికి 8 కవితా సంకలనాలు, ఒక కథా సంపుటి వెలువరించి వున్నారు. ఇది రెండవ కథా సంపుటి 'పడమటి సూర్యోదయం' అన్న శీర్షిక ఆసక్తి గొలిపేలా ఉంది.

ఈ పుస్తకంలో మొత్తం 20 కథలున్నాయి. ప్రతి కథ ఆణిముత్యమే! సరళత్వం, సంక్షిప్తత కథా సాహిత్యానికి పెట్టని ఆభరణాలు. ఆ లక్షణాలు అవ్వారు కథల్లో అడుగడుగునా కన్పిస్తాయి. పాఠకులను అలరిస్తాయి.

ప్రాజెక్టులు కట్టేటప్పుడో, రాజధానులు నిర్మించేటప్పుడో రైతులు చేసే త్యాగాలు వెలకట్టలేనివి, మరిచిపోలేనివి. కానీ, వారికి చివరకు మిగిలేది హృదయ క్షోభే! ఆ విషయాన్ని కళ్లు చెమర్చేలా రచయిత "నీళ్లు వదిలేసిన ఊరు" కథలో చెప్పారు.



పడమటి సూర్యోదయం
రచయిత:
అవ్వారు శ్రీధర్ బాబు
పేజీలు: 128 వెల: 150/-
ప్రతులకు:
అవ్వారు శ్రీధర్ బాబు
23-1-57, పెండెంవారి వీధి, ఫత్తేఖాన్‌పేట,
నెల్లూరు - 3. సెల్:8500130770.

నాగరికత పెరిగే కొద్దీ భౌతిక అవసరాలు పెరిగాయి. పక్కింట్లో ఏది వుంటే అదే మనకూ కావాలి. పాత వస్తే రోత కలిగిస్తున్నాయి. కొత్త వస్తువుల పట్ల 'మోజు' ఎక్కువవుతున్నది. ఈ విషయాన్ని 'రాజయ్య' అనే పాత్ర చేత రచయిత చెప్పిస్తూ "నాలుగు రూకలు ఇకనైనా మీ కోసం ఉంచుకోండి, మనమూ పాత వాళ్లమే కదా!" అంటాడు 'ఇరుకు మనసు అనే కథలో'. రాజయ్య తన అనుభవాల నుంచి మనల్ని ఆ విధంగా హెచ్చరిస్తాడు.

ఒకడు భార్య కోరిక మీద కాన్వెంట్ చదువులు చదివిద్దామని పట్టణానికెళ్లి, కార్పొరేట్ స్కూల్‌లో లక్ష రూపాయల ఫీజు గురించి తెలుసుకొని విస్తుపోయాడు. టైంటేబుల్‌లో ఉదయం తొమ్మిదింటి నుండి రాత్రి ఏడు వరకు బిజీ షెడ్యూల్. భూతద్దంపెట్టి వెతికినా ఆటలకు టైం కన్పించదతనికి. చిన్నప్పుడు బడిలో ఆడిన ఆటలు గుర్తొచ్చాయి. తిరుగు ప్రయాణంలో బస్టాండ్ పక్కన పార్క్ ఒకటి కన్పించింది. లోపలికెళ్లాలంటే పది రూపాయలు టికెట్. ఆడుకోడానికి కూడా ఫీజా! ఆశ్చర్యపోయాడు. ఖాళీగా వున్న పార్క్‌ను చూసి, పార్క్‌లకు పిల్లలొచ్చే కాలమా ఇది? సాయంత్రాలను బండెడు హోంవర్క్‌లు మింగేశాయి కదా? అని నిట్టూరుస్తాడు. బాల్యం అంటే చదువుకోడానికే... అనే భావన తల్లిదండ్రులందరిలోనూ బలపడిపోయిందనే విషయాన్ని రచయిత సోదాహరణంగా చెప్పి, తల్లిదండ్రులను ఆలోచింపజేస్తాడు "ఆట స్థలం" అనే కథలో. ప్రస్తుత విద్యావ్యవస్థకు దర్పణం ఈ కథ.

అతివృష్టి, అనావృష్టిలతో రైతులు తల్లడిల్లిపోతున్నారు. అగ్గికి ఆజ్యం తోడయినట్లు కల్తీ విత్తనాలు, ఎరువుల కొరత, దళారుల దోపిడీలు రైతుల జీవితాలను దుర్భరం చేస్తున్నాయి. వ్యవసాయం కలిసి రాక పల్లె వదిలి పట్నం చేరిన మల్లన్న బ్యాంక్‌లో సెక్యూరిటీ గార్డ్‌గా చేరదామని వెళ్తే మేనేజర్ గుర్తుపడతాడు. పల్లెలో పని చేస్తున్నప్పుడు మల్లన్న ఇంటిలోనే వసతి పొందివుంటాడు మేనేజర్ ఒకప్పుడు. పెద్ద పెంకుటిల్లు మల్లన్నది. వసారాలో ఒక రూం కట్టి వుంటే, దాంట్లో మేనేజర్ వసతి పొందడమే గాక టిఫిన్, కాఫీ, భోజనం అక్కడే. డబ్బు ఇవ్వబోతే మల్లన్న తీసుకోడు. జేబులో బలవంతాన కుక్కాల్సిందే! ఇవన్నీ మేనేజర్‌కు గుర్తుకొస్తాయి. సామాన్యంగా గ్రామాల్లో వుండే 'అన్నదాత' ఔదార్యాన్ని రచయిత ఒడిసి పట్టి, మల్లన్న పాత్రను తీర్చిదిద్దారనిపిస్తోంది. పల్లె వదిలి పట్నానికి రావడానికి కారణం మల్లన్న ద్వారా మేనేజర్ తెలుసుకుంటాడు. పొలం తనఖా పెట్టి లోన్ తీసుకుని, వాయిదాలు సరిగా కట్టలేకపోవడమే పట్నం రావడానికి కారణంగా చెప్తాడు మల్లన్న. మేనేజర్ మల్లన్న గ్రామంలో బ్యాంక్ మేనేజర్‌తో మాట్లాడి, మరికొంత లోన్ ఇప్పించి, వ్యవసాయం కొనసాగించమని చెప్తాడు. ఆ విధంగా మేనేజర్ పాత్రను పాఠకుల మదిలో కలకాలం నిలిపారు రచయిత. రైతుల పట్ల ప్రేమచూపే ఇలాంటి మేనేజర్లు ఆదర్శం. బ్యాంక్‌లు సాధారణంగా రైతుల్ని ఎంతగా తక్కువగా చూస్తాయో అందరికీ తెలిసిందే!

'వ్యవసాయం' అన్న ఈ కథ చదువుతున్నంత సేపు పాఠకుడికి 'ఒక నిజాన్ని' ఎదురుగా చూస్తున్న భావన కలుగుతుంది. కళ్లు తడి అవుతాయి. ఒక చోట కథలో మల్లన్న భార్య, మేనేజర్‌కు కృతజ్ఞతతో దండం పెట్టబోతే, "అమ్మా! అవి వరమహాలక్ష్మి చేతులు - పదిమందికి అన్నం పెట్టడానికి ఉపయోగపడ్డవి, దండం పెట్టొద్దు" అంటాడు మేనేజర్. హృదయాలను కదిలిస్తాయి ఆ మాటలు. శ్రీధర్‌బాబు కథల్లో ఇలాంటి మాటలు కోకొల్లలు.

శ్రీధర్‌బాబు కలం నుంచి మరిన్ని మంచి కథలను ఆశిద్దాం..!



డా. గంగిశెట్టి శివకుమార్
నెల్లూరు. సెల్:9441895343.

## అలరించిన చిన్నారుల కోలాటం



గురుపూర్ణిమ సందర్భంగా గూడూరు శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో ఈ నెల 20వ తేదీ గూడూరు యోగ నరసింహ కోలాటం భజన మండలి ఆధ్వర్యంలో స్థానిక మహిళలు,చిన్నారులు కోలాటం, భజన కార్యక్రమాలను నిర్వహించారు. ఉమా మహాలక్ష్మి, ఎస్.ఎల్.ఎన్ స్వామి పర్యవేక్షణలో సాయినాథుని స్మరిస్తూ నిర్వహించిన ఈ కోలాట, భజన, కీర్తనలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

## రాజధానికి నిధులు.. హర్షదాయకం

• బీజేవైఎం నాయకుడు మనోజ్



కేంద్ర బడ్జెట్‌ని స్వాగతిస్తున్నామని భారతీయ జనతా యువమోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గిద్దలూరు మనోజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్డీఏ ప్రభుత్వం వరుసగా మూడో సారి ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత మొట్టమొదటి బడ్జెట్ దేశ ప్రజలు స్వాగతించే విధంగా ఉందని, అన్ని వర్గాలను, అన్ని రాష్ట్రాలను ఆదుకునే విధంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో ఆర్థికమంత్రి నిర్మల సీతారామన్ 24-25 భారత్ బడ్జెట్ ప్రవేశపెట్టారన్నారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రజల కలల రాజధాని నిర్మాణం కోసం బడ్జెట్‌లో ఈ ఏడాదికి రూ.15 వేల కోట్లు కేటాయించడం జరిగిందని, అవసరాన్ని బట్టి మరిన్ని నిధులు కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నామని సీతారామన్ చెప్పడం హర్షణీయమన్నారు. తెలుగు ప్రజల తరపున ఎన్డీఏ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు.

## దివ్యాంగులకు జేవీవీ కూరగాయలు

గూడూరు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో డాక్టర్ కుడుముల వెంకటనారాయణ దాతృత్వంతో బనిగిసాహెబ్‌పేట వద్దనున్న పెట్రోల్‌బంకు దగ్గర దివ్యాంగులకు కూరగాయలు, గుడ్లు పంపిణీ చేశారు. జేవీవీ ఉపాధ్యక్షులు చెంచు నారాయణ, నాగరాజు, రాఘయ్య, గుర్రం విజయబాబు, సుబ్బారావు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## 28న.. చెన్నైలో సాహిత్యోపన్యాసం

చెన్నైలోని వేద విజ్ఞాన వేదిక నిర్వహిస్తున్న తరతరాల తెలుగు కవిత ఉపన్యాస ధారావాహికలో భాగంగా ఈనెల 28న 151వ ప్రసంగంగా 'చాటు పద్యము-హాస్యము' అనే అంశంపై సాహిత్యోపన్యాసం ఏర్పాటుచేశారు. గుంటూరు హిందూ కళాశాల అధ్యాపకులు డా.నందనవనం శ్రీనివాసరావు పాల్గొని ఉపన్యసిస్తారని, చెన్నై-టీనగర్‌లోని కృష్ణాహాల్ ఆంధ్రాక్లబ్‌లో ఆ రోజు సాయంత్రం 6.30 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులందరూ తరలిరావాలని వేదిక అధ్యక్షులు జెకె రెడ్డి, కార్యదర్శి కందనూరు మధు ఒక ప్రకటనలో ఆహ్వానం పలికారు.

# కోటా లేకుండా స్థానికులకు ఉద్యోగాలు సాధ్యమే!

ప్రైవేటు ఉద్యోగాల్లో స్థానికులకు కోటా కల్పిస్తూ కర్ణాటక ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన బిల్లు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారి తీసింది. ప్రైవేటు సంస్థల్లోని మేనేజ్‌మెంట్ ఉద్యోగాల్లో 50శాతం, మేనేజ్మెంటేతర ఉద్యోగాల్లో 75శాతం స్థానికులకే ఇవ్వాలని ప్రతిపాదిత చట్టం పేర్కొంది. మంత్రివర్గం ఆమోదం పొందిన ఈ బిల్లుపై పరిశ్రమ వర్గాలు పెద్ద ఎత్తున వ్యతిరేకత కనపరచాయి. మోహన్ దాస్ పాయ్, కిరణ్ మజుందార్ షా సహా పరిశ్రమకు చెందిన పలువురు పెద్దలు ఈ ప్రతిపాదిత బిల్లును విమర్శించారు. వివక్షాపూరితమని, టెక్ పరిశ్రమ వృద్ధికి విఘాతమని అభిప్రాయపడ్డారు. ఐటీ హబ్‌గా పేరుపొందిన బెంగళూరులో పెట్టుబడులపై ప్రభావం పడే అవకాశం ఉండడంతో విస్తృత చర్చల అనంతరమే చట్టం తీసుకొస్తామని ప్రస్తుతానికి ప్రభుత్వం బిల్లును వాయిదా వేసింది. కర్ణాటకకు వలస వచ్చిన వారికి ప్రైవేటు రంగంలో ఉద్యోగాలు ఇవ్వబోరని ఈ బిల్లు చెప్పడంలేదు. కర్ణాటకలో కనీసం 15 ఏళ్లకు పైగా నివాసముంటూ కన్నడం మాట్లాడడం, రాయడం, చదవడం వచ్చిన వారికి ఉద్యోగాలుంటాయి. మరోమాటలో చెప్పాలంటే కర్ణాటకలో స్థిరపడి ఉండాలి. ఉద్యోగానికి తగిన అర్హతలున్నవారు స్థానికంగా లభ్యం కాకపోతే స్థానికులకే ప్రభుత్వం లేదా ప్రభుత్వ సంస్థల భాగస్వామ్యంతో శిక్షణ ఇచ్చి నియమించుకోవాలి. స్థానికంగా తగినంత మంది లభ్యం కాకపోతే ప్రభుత్వ సమ్మతితో మేనేజ్‌మెంట్ ఉద్యోగాల్లో కోటాను 25శాతానికి, మేనేజ్మెంటేతర ఉద్యోగాల్లో కోటాను 50శాతానికి తగ్గించుకోవచ్చు. ఈ నిబంధనలేవీ ఆచరణ సాధ్యం అయ్యేవికావని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.

## రాజ్యాంగ విరుద్ధమా?

కర్ణాటక కన్నా ముందు హరియాణ, ఝార్ఖండ్, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర కూడా ఇటువంటి కోటాకు ప్రయత్నించాయి, కానీ వివిధ కారణాల వల్ల అది అమల్లోకి రాలేదు. హరియాణలో కోటా బిల్లును రాష్ట్ర హైకోర్టు రాజ్యాంగ విరుద్ధమంటూ కొట్టేసింది. దీంతో రాష్ట్రప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లింది. కేసు పెండింగ్‌లో ఉంది. రాజ్యాంగంలోని 14వ అధికరణం–సమానత్వపు హక్కును, అధికరణం 19(1)(జి)–ఏ పని అయినా చేసుకునే హక్కును, అధికరణం 16(2)– ఉద్యోగ కల్పన అవకాశంలో సమానత్వపు హక్కును కల్పిస్తున్నాయి. ప్రైవేటు ఉద్యోగాల్లో స్థానికులకు కోటా కల్పించడం వల్ల రాజ్యాంగం... పౌరులకు ప్రసాదించిన ఈ హక్కులకు భంగం వాటిల్లుతుందని కోటాను వ్యతిరేకించేవారి వాదన. జగన్ ప్రభుత్వం 2019లో ఇలాంటి చట్టాన్నే తీసుకురాగా ప్రస్తుతం ఈ అంశం ఏపీ హైకోర్టు పరిధిలోఉంది. ఈ చట్టం రాజ్యాంగ విరుద్ధం కావచ్చని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఉద్యోగాల్లో కోటా వల్ల నిపుణులైన మానవవనరుల లభ్యతలో పరిమితులెదురవుతాయని, నియామకాల్లో రాజీపడాల్సి వస్తుందని పరిశ్రమ వర్గాల ఆందోళన. ఫలితంగా నాణ్యమైన ఉత్పత్తి, ఉత్తమమైన సేవలు ఇవ్వలేమని, ప్రపంచ మార్కెట్లో భాగమైన మనం, ఇతర దేశాలతో పోటీపడలేమని పరిశ్రమ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అంతిమంగా ఇలాంటి కోటాల వల్ల భారత ఆర్థిక వృద్ధికి ప్రతిబంధకమవుతుందని భావిస్తున్నాయి.

## స్థానికులకు ఉద్యోగాలు చూపించాల్సిన బాధ్యత ఉంది!

నాణేనికి మరో వైపు కూడా మనం చూడాలి. ప్రజల ఓట్లతో ఎన్నికయిన వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న హామీల్లో ప్రధాన హామీ ఉద్యోగ కల్పన. పట్టణీకరణ పెరుగుతున్న నేపథ్యంలో ఉద్యోగాల కల్పన రాష్ట్రాలకు పెద్ద సవాలుగా మారింది. ప్రభుత్వ ఉద్యోగాల సంఖ్య పరిమితం. పోటీ అధికం. ఉద్యోగాల కల్పనకు ఉన్న అవకాశం ప్రైవేటు రంగమే. అందుకే రాష్ట్రప్రభుత్వాలు పెట్టుబడులను ఆకర్షించడానికి పెద్దఎత్తున ఆసక్తి చూపుతున్నాయి. ప్రోత్సాహకాలు అందిస్తున్నాయి. అధిక సంఖ్యలో యువతకి ఉద్యోగ అవకాశాలు కలగడంతో పాటు, దీనివల్ల మార్కెట్లో ద్రవ్య చలామణి పెరుగుతోంది. రాయితీలు పోగా ఆయా కంపెనీల నుంచి ప్రత్యక్ష పన్నుల రూపంలో ప్రభుత్వాలకు రాబడి కూడా వస్తోంది. పరోక్షపన్నుల ద్వారా మరింత ఆదాయం చేకూరుతుంది. అయితే స్థానికులకే ఉద్యోగాలు కల్పించాలని కానీ, స్థానికేతరులకే ఉద్యోగాలు ఇవ్వాలని కానీ కంపెనీలు పరిమితులు విధించుకోకుండా ఉద్యోగానికి ఎవరు అర్హులో వారినే నియమించుకుంటున్నాయి. కంపెనీల కోణంలో చూస్తే ఈ విధానం సరైనదే. కానీ రాష్ట్ర యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చే ప్రభుత్వాలు... హామీ నిలబెట్టుకోలేని పరిస్థితిని ఎదుర్కొనే అవకాశాలున్నాయి. నిరుద్యోగ యువత అసంతృప్తిని ఎదుర్కోవడం సామాన్యమైన విషయం కాదు. అందుకే ఇలాంటి కోటా అంశాలు ఇటీవల తెరపైకి వస్తున్నాయి.

## ఉత్తమమైన మార్గం లేదా?

అటు కంపెనీలకు, ఇటు స్థానికులకు కూడా లాభదాయకమైన మార్గం ఖచ్చితంగా ఉంది. వివిధ రంగాల్లో భవిష్యత్తులో వచ్చే మార్పులను ముందుగానే అంచనా వేసి దానికి తగ్గట్లు స్థానికంగా కోర్సులు, నైపుణ్య శిక్షణ అందివ్వగలిగితే స్థానికులకు ఉద్యోగాలివ్వడానికి కంపెనీలకు అభ్యంతరమేమీ ఉండదు. ఈ విషయంలో ఏపీ ప్రభుత్వం అమలు చేస్తున్న నైపుణ్య గణన– అంటే రాష్ట్రంలో ఎవరికి ఏ నైపుణ్యాలున్నాయి? నైపుణ్య అంతరం ఎంత ఉందని అంచనావేసే కార్యక్రమం ఒక మంచి ముందడుగు. వాస్తవానికి నైపుణ్య గణన సూచన ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నుంచి వచ్చింది. ఏపీ సీఎం చంద్రబాబు దార్శనికత ఇటువంటి సమస్యలకు చక్కటి పరిష్కారం చూపించగలదు. ఆయా రంగాల్లో రాబోయే మార్పులను ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తూ అంచనా వేయడంలో, దార్శనిక పత్రాలను రూపొందించడంలో ఆయన దిట్ట. రాబోయే మార్పులను అంచనా వేస్తూ ఎప్పటికప్పుడు నైపుణ్య శిక్షణ అందిస్తే కోటా లేకుండానే స్థానికులకు ఉద్యోగాలు వస్తాయి. అప్పుడు కోటా ఉన్నా కంపెనీలకి వచ్చే నష్టంలేదు. ఎందుకంటే స్థానికంగా తగిన మానవవనరులు లభ్యం అవుతున్నప్పుడు వేరే ప్రాంతాల నుంచి నియమించుకునే అవసరం కంపెనీలకు ఉండదు. ఏపీ ప్రభుత్వం అమలు చేస్తున్న నైపుణ్య గణన కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలూ ఆచరిస్తే ఉద్యోగ కల్పన సమస్యకు చక్కటి పరిష్కారం లభించినట్లవుతుంది ...!



**తుమ్మల బాల గంగాధర్ తిలక్**




రాముని కోసం సరికొత్త వింజామరలు, శ్వేతఛత్రం సిద్ధం చేయబడ్డాయి. తెల్లటి వృషభం, తెల్లటి గుర్రం, మదగజం ఆయన కోసం వేచివున్నాయి.

సకలాభరణభూషితలైన ఎనమండుగురు కన్యలు, అన్ని వాద్యాలు, స్తోత్రపాఠాలు చదివేవారు ఆయన రాక కోసం నిరీక్షిస్తున్నారు.

కైక ఇంటిలో, రాముడు తండ్రి ఎదుటనిల్చొని ఉన్నాడు. ఆయనకు సమీపంలో లక్ష్మణుడు కూడా నిలుచున్నాడు.

దశరథుడు రాముని వంక చూశాడు, ఆయన కళ్ళనిండా నీళ్ళునిండి ఉన్నాయి. రాముడి రూపం అస్పష్టంగా కనపడుతోంది. గొంతులో నుండి మాట రావడంలేదు. అతి కష్టం మీద గొంతు పెకిలించుకుంటూ "రామా" అని మాత్రం అనగలిగాడు.

తండ్రి ఆకారం రాముడికి కొత్తగా ఉంది! ఇంతకు మునుపెన్నడూ తానుపుట్టి బుద్ధెరిగిన తరువాత అటువంటి తండ్రి రూపం చూసి ఎరుగడు. ఆయన మనస్సులో తండ్రి గురించిన ఏదో భయం పొడసూపింది. పామును తొక్కినవాడివలే భయపడ్డాడు.

అంతకుముందు ఎప్పుడైనా కోపంగా ఉండే తండ్రి తనను చూడగానే ప్రసన్నుడయ్యేవాడు, హాయిగా నవ్వేవాడు! నేడేమిటి? ఆయన కోపంగా లేడు. కానీ నన్ను చూడగనే హాయిగా ఉండే ఆయన ఇలా ఇంత విచారంగా ఉన్నాడేమిటి?

మనసులో ఆ శంక పీడిస్తుండగా రాముడు దీనుడై, ముఖకాంతి తగ్గినవాడై ప్రక్కనే ఉన్న పినతల్లి కైకకు నమస్కరించి, తల్లీ నా వలన అపరాధమేదీ జరుగలేదు కదా! నాపై ఈయన ఎందుకు కోపించినాడు? నీవయినా ఆయనకు నా పట్ల అనుగ్రహం కలిగించమ్మా! అని వేడుకున్నాడు.

నా తండ్రికి కోపం వస్తే ఆయనను సంతోషపెట్టకుండా, ఆయన ఆజ్ఞను పాటించకుండా ఒక్క క్షణం కూడ జీవించి ఉండలేను.

పూర్వమెన్నడూ నేను ఎరుగని ఈ వికారం నా తండ్రిలో ఏల కలిగినది చెప్పమ్మా! అని ప్రాధేయపడినాడు.

అప్పుడు సిగ్గు,లజ్జ, మర్యాద అన్నీ వదిలిన కైక ఇలా పలికింది.

కైక ముఖంలో కాఠిన్యం ప్రతిఫలిస్తుండగా రామునితో, రామా! నీకు ఒక విషయం చెప్పాలి! అది చెప్పేందుకు నీ తండ్రికి నోరు రావడం లేదు, అందుకే ఆయన అలా ఉన్నాడు, అంతేగానీ ఏవిధమైన ఆపద సంభవించలేదాయనకు.

అది నీకు అప్రియం కావచ్చును కానీ, అది ఆయన ప్రతిజ్ఞా పాలనకు సంబంధించింది, ఆయన ఇచ్చిన మాట చెల్లించే సమయం నేడు ఆసన్నమైంది..

నీ తండ్రి పూర్వం నాకు ఒక వరం ఇచ్చి వున్నాడు, ఆ వరం నాకిచ్చినందుకు సామాన్యమానవుడిలాగ విలపిస్తున్నాడు. అదేదో పాప కార్యమన్నట్లుగా భావిస్తున్నాడు.పశ్చాత్తాపం చెందుతున్నాడు.

సత్యం వచించుట, ఇచ్చినమాట నిలబెట్టుకొనుట సత్పురుషుల లక్షణం, నీ తండ్రి మాట చెల్లించగలనని నీవు మాట ఇచ్చినచో ఆయన నాకిచ్చిన వరం గురించి నీకు తెలియజేయగలను. ఈయన స్వయంగా నీకది చెప్పలేడు.

ఆవిధంగా మాట్లాడుతున్న పినతల్లిని చూసి మనస్సులో బాధ పడుతూ!.. ఛీ ఎంత కష్టం తల్లీ! నా విషయంలో నీవు ఇటుల మాటలాడవలదు!

నా తండ్రి ఆజ్ఞాపించినచో అగ్నిలో దూకెదను, ఆయన కాలకూట విషమిచ్చి త్రాగు రామా! అన్నచో అది అమృతమువలే సేవించగలను.

తల్లీ నీ మనసు నెరిగింపుము!

రాముని వద్ద రెండు మాటలు లేవు..

**రామో ద్విర్నభిభాషతే!**

(ఇప్పుడొక మాట తరువాత ఒక మాట లేవు !ఎప్పుడూ ఒకటే మాట!)... ఒకటే మాట!

రామా! నీ తండ్రి పూర్వం నాకిచ్చిన వరాలను నేడు అమలుపరచమంటున్నాను దాని ప్రకారం... భరతుని రాజ్యాభిషిక్తుని చేయవలెను...

నేడే నీవు జటావల్కలధారివై దండకారణ్యంలో పదునాల్గువత్సరములు నివసింపవలే!.

తండ్రి ఆజ్ఞ పాలింపుము.. నీ కొరకై ఏర్పరచిన అభిషేక సామాగ్రితో భరతునికి పట్టముగట్టవలే.

మరణశాసనం వంటి ఆ పలుకులు రాముని ఏ మాత్రం బాధించలేదు! ప్రశాంతత చెడలేదు! వ్యథ దరిచేర లేదు.

అమ్మా! నీవు చెప్పినట్లే జరుగుతుంది!.

అమ్మా! నా తండ్రి మాటలు యుక్తమా లేక అయుక్తమా అని నేను విచారణ చేయను, ఆయన కోరిక ప్రకారం పదునాలుగేండ్లు వనవాసమునకు ఈ క్షణమే బయలుదేరగలను.

ఒక్కవిషయం మాత్రము నా హృదయాన్ని దహించి వేయుచున్నదమ్మా! నా తండ్రిగారే నాకు స్వయంగా చెప్పకున్నారేమి?

అయినా రాజ్యాభిషేకానికి భరతుడికి అభిలాష ఉందని నాకు తెలియదు. తెలిసియున్న ఎడల నా సర్వస్వం అతనికి ధారపోసి యుండెడివాడను.

రాముడి ఈ పలుకులు దశరథమహారాజు యొక్క గాయమయిన హృదయాన్ని కెలికినట్లుగా ఉన్నాయి. ముదుసలి మహారాజు తట్టుకోలేకపోతున్నాడు. ఆయన కళ్ళ నుండి ధారాపాతంగా కన్నీరు కారుతోంది. వంచిన తల ఎత్తలేక, సూటిగా రాముని చూడలేక సతమతమవుతూ యమయాతన అనుభవిస్తున్నాడు.



ఇటు కైక సంతోషం పట్టనలవిగాకుండా ఉంది! రామా! నేను చెపితే రాజు చెప్పినట్లేగదా! ఎవరు చెప్పారన్నది అంత ప్రధానం కాదు! ఇది రాజుగారి అభిమతం.

ఇంక నీవు ఆలస్యం చేయక వెంటనే బయలుదేరవలెను అని అంటూ తొందరపెట్టసాగింది. నీవు ఈ పట్టణం విడిచి వెళ్ళనంతవరకు నీ తండ్రి స్నానం, భోజనం చేయరు!

ఈ మాటలు వింటున్న దశరథుడు దీర్ఘంగా నిట్టూర్చి ఛీ! ఎంత కష్టం వచ్చింది అని తనలో తనే అనుకుంటూ కూర్చున్న మంచం మీద కూర్చున్నట్లే ఒరిగిపోయాడు, స్పృహతప్పిపోయాడు.

రాముడు తండ్రిని లేవదీసి మరల కూర్చుండపెట్టబోయాడు, కానీ మరలమరల కొరడాతో గుర్రాన్ని కొట్టినట్లుగా కైక ప్రేరేపించటం మొదలుపెట్టింది! ఆవిడ తొందరను గమనించిన రాముడు...

అమ్మా! నాకు ధనము ప్రధానం కాదు, ఋషులవలే నాకు కూడా ధర్మమే ప్రధానం తల్లీ! నీవింతగా నన్ను తొందరపెట్టవలసిన పని లేదమ్మా! నా తండ్రి కొరకు ఇప్పటికిప్పుడు నా ప్రాణాలనైనా ధారపోయగలనమ్మా! అని అన్నాడు. తండ్రి ఆజ్ఞను పాటించుటకు మించి ధర్మాచరణము లేదమ్మా నాకు!.. నా జీవితంలో అర్థమునకు, సంపదలకు ప్రధానం లేదమ్మా! ధర్మమే! నా జీవన హేతువు!

అమ్మా! నీకు నా మీద అధికారమున్నదమ్మా! భరతునికి రాజ్యమిమ్మని నీవే నాతో చెప్పవచ్చుగదమ్మా! తండ్రిగారి ద్వారా ఎందులకు? నీకు నా గుణాలమీద ఇప్పటికీ నమ్మకం లేదని తెలుస్తుందమ్మా!

అమ్మా! మా అమ్మ కౌసల్యకు, సీతకు చెప్పి తక్షణమే పయనమైపోగలవాడను.. అని పలికి తండ్రికి, పినతల్లికి నమస్కరించి అచటనుండి నిష్క్రమించాడా ధర్మస్వరూపుడు!

సుమిత్రానందనుడికి పట్టరాని కోపం వచ్చింది! నేత్రాలు అశ్రుపూర్ణములయినాయి! ఎర్రబడ్డకన్నులతో అన్నను అనుసరించాడు లక్ష్మణుడు!.

.. (సశేషం)

# ఆశల బడ్జెట్.. ఆంధ్రాకి జాక్‌పాట్

(మొదటిపేజీ తరువాయి)

కదా.. అని విలేకర్లు ప్రశ్నించగా, పూచీకత్తు కేంద్రానిదే కదా అని భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి తిరిగి ప్రశ్నించారు. వీరిద్దరూ అన్నట్లు ఇది పూర్తిగా కేంద్రం సాయం అయితే ఆ పార్టీకి రాష్ట్ర ప్రజలు రుణపడి ఉంటారు. ఒకవేళ ప్రపంచబ్యాంకు రుణమైనా, జైకా నిధులైనా రాష్ట్రంపై పెద్దగా భారంపడదు. ఈ మొత్తంతో రాజధాని నిర్మాణం జరిగి... అక్కడ పరిశ్రమలు, ఐటీ కంపెనీల ఏర్పాటుతో అభివృద్ధి జరిగి భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్ ఆదాయం పెరిగితే రాష్ట్రప్రభుత్వమే ఈ రుణాన్ని చెల్లించే అవకాశం ఉంటుంది. లేకున్నా కేంద్రమే పూచీకత్తుగా ఉంటుంది కాబట్టి కేంద్రప్రభుత్వమే ఆ రుణం మొత్తాన్ని వివిధ మార్గాల్లో చెల్లిస్తుంది. కేంద్రప్రభుత్వం హామీ ఉండడంతో రాష్ట్ర ప్రభుత్వంపై నేరుగా రుణభారం పడే అవకాశం లేదని ఆర్థిక నిపుణులు కూడా చెప్తున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితి బాగాలేదు కాబట్టి కేంద్రప్రభుత్వమే నిధుల బాధ్యత తీసుకుంటుందని నిర్మలా సీతారామన్ కూడా స్పష్టం చేశారు.

## అధోగతి నుండి పురోగతి వైపు...!

'చంద్రబాబు అమరావతిని నిర్మించలేకపోయారు, నేను అధికారంలోకి రాగానే ప్రజల కలల రాజధాని అమరావతిని నిర్మిస్తా'నని 2019ఎన్నికల సందర్భంగా జగన్ హామీ ఇచ్చారు. కానీ అధికారంలోకి రాగానే మాట మార్చారు. మూడు రాజధానుల నినాదం ఎత్తుకున్నారు. అమరావతి రైతులను, మహిళలను, అక్కడ ఉన్న అన్ని వర్గాల ప్రజలను అవహేళనకు గురిచేశారు. కేసులతో హింసించారు. పోలీసులతో కొట్టించారు. అరెస్టులు చేయించారు. అమరావతి ఉద్యమాన్ని ఉక్కుపాదంతో అణచి వేయడానికి సర్వశక్తులూ ఒడ్డారు. మొత్తంమీద మూడు రాజధానుల పేరుతో అసలు రాజధానే లేకుండా చేశారు. రాష్ట్రంలో కొత్త పరిశ్రమలు తేకపోగా, ఉన్న పరిశ్రమలను కూడా తరిమేశారు.

తాజాగా కేంద్రం ప్రకటించిన రూ.15 వేల కోట్ల నిధులతో అమరావతి నిర్మాణం ఊపందుకోవడం ఖాయమని తేలిపోయింది. రాజధాని విషయంలో స్పష్టత వచ్చేసింది. ఇప్పటికే పనులు మొదలయ్యాయి. ముళ్లకంపలతో మురికి కూపంగా మారిన ప్రదేశాలకి కొత్త కళ తెస్తున్నారు. నిర్జీవంగా ఉన్న ప్రాంతాలకి జీవం పోస్తున్నారు. అక్కడి నిర్మాణాల పటిష్టత అధ్యయనానికి ఐఐటీ చెన్నై, ఐఐటీ హైదరాబాద్ సంస్థలతో కలిసి పనిచేయనున్నట్లు మంత్రి నారాయణ ఇప్పటికే ప్రకటించారు.

## పారిశ్రామిక నడవాలకు ఊతం

విశాఖపట్నం - చెన్నై పారిశ్రామిక నడవాలోని కొప్పర్తి నోడ్, హైదరాబాద్- బెంగళూరు పారిశ్రామిక నడవాలోని ఓర్వకల్లు నోడ్‌లకు అత్యవసర మౌలిక వసతులైన నీరు, విద్యుత్, రైల్వే మార్గం, రహదారుల నిర్మాణం వంటి వసతుల కల్పనకు నిధులు ఇవ్వనున్నట్లు నిర్మల సీతారామన్ ప్రకటించారు. దీంతో ఈ ప్రాంతాల్లో పెద్దఎత్తున పరిశ్రమలు వచ్చి స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగనున్నాయి. గతంలో తెలుగుదేశం హయాంలో అనంతపురం జిల్లాలో కియా, చిత్తూరు జిల్లా రేణిగుంట ప్రాంతంలో ఎలక్ట్రానిక్స్ క్లస్టర్ ఏర్పాటుతో 2 జిల్లాల్లో అభివృద్ధికి పునాదులు పడ్డాయి. ఇప్పుడు కొప్పర్తి, ఓర్వకల్లు నోడ్‌లకు తాగునీరు, విద్యుత్, రహదారులు, రైల్వే తదితర మౌలిక సౌకర్యాలు కల్పించాలని కేంద్రం నిర్ణయించడంతో రాయలసీమలోని నాలుగు జిల్లాల్లో పారిశ్రామికాభివృద్ధి మరింత విస్తృతం కానుంది. కర్నూలు జిల్లాలోని ఓర్వకల్లు కేంద్రంగా మెగా పారిశ్రామికవాడ అభివృద్ధికి గతంలో టీడీపీ హయాంలోనే శ్రీకారం చుట్టారు. హైదరాబాద్-బెంగళూరు పారిశ్రామిక నడవాలో భాగంగా దీనిని అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. వైకాపా అధికారంలోకి వచ్చాక పట్టించుకోలేదు. పరిశ్రమలకు నీటి సౌకర్యం కూడా కల్పించలేదు. దీంతో పరిశ్రమల ఏర్పాటుకు ఎవరూ ముందుకు రాలేదు. ఈ పారిశ్రామికవాడకు తాజాగా ఆర్థిక ఊతం ఇవ్వడంతో కర్నూలు, నంద్యాల, కడప, తిరుపతి ప్రాంతాల్లో పరిశ్రమల విస్తరణకు అవకాశాలు మెరుగుపడతాయి. విశాఖపట్నం- చెన్నై పారిశ్రామిక నడవాలో భాగంగా వైఎస్సార్ జిల్లా కొప్పర్తిలో 5760 ఎకరాల్లో పారిశ్రామికవాడ ఏర్పాటుకు గత ప్రభుత్వం ప్రతిపాదించింది. రూ.25 వేల కోట్ల పెట్టుబడులతో, 75 వేల మందికి ఉపాధి లభిస్తుందని అంచనా వేసింది. అక్కడ కూడా నీటి వసతులు కల్పించలేకపోవడంతో కంపెనీలు రాలేదు. జగన్ హయాంలో ప్రారంభమైందని, తనకెందుకని చంద్రబాబు నిర్లక్ష్యం చేయకుండా కొప్పర్తిని మరింత అభివృద్ధి చేయాలని సంకల్పించారు. మౌలిక సౌకర్యాల కల్పనకు నిధులు కేటాయించాలని కేంద్రాన్ని కోరారు. దీంతో కొప్పర్తి పారిశ్రామికవాడ అభివృద్ధికి నిధులు ఇవ్వడానికి కేంద్రం అంగీకరించి బడ్జెట్లో పెట్టింది. విశాఖపట్నం-చెన్నై కారిడార్ ఏర్పాటు ద్వారా 1.40 కోట్ల మందికి ఉపాధి లభిస్తుందని అంచనా. మొదటి దశలో ఉమ్మడి విశాఖలోని నక్కపల్లి, అచ్యుతాపురం, ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని శ్రీకాళహస్తి-ఏర్పేడు, ఉమ్మడి కడప జిల్లాలోని కొప్పర్తి పారిశ్రామికవాడల ఏర్పాటుకు ప్రతిపాదించారు.

## వెనకబడిన ప్రాంతాలకు ప్రత్యేక దన్ను!

రాష్ట్రంలో వెనకబడిన ప్రాంతాలైన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ప్రకాశం జిల్లాకూ వెనకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధులు కేటాయించనున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి చెప్పారు. ఈ నిధులతో ఇక్కడ పారిశ్రామిక నడవాలు ఏర్పాటయి పెద్ద ఎత్తున ఉపాధి దొరికే అవకాశం ఉంది. వెనకబడిన జిల్లాగా ఉమ్మడి ప్రకాశం జిల్లాను గుర్తించడం సంతోషకరమైన విషయం.

## పూర్వోదయంతో నవోదయం!

బిహార్, ఝార్ఖండ్, పశ్చిమబెంగాల్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌తో కూడిన దేశ తూర్పు ప్రాంత అభివృద్ధికి పూర్వోదయ పేరుతో ప్రణాళిక రూపొందించనున్నట్లు నిర్మలమ్మ ప్రకటించారు. వికసిత భారత్‌కు ఇది ఇంజన్‌గా మారుతుందని ఆమె పేర్కొన్నారు. వాస్తవానికి దేశ తూర్పు తీరం మొత్తాన్ని ఓడరేవుల నడవాగా అభివృద్ధి చేస్తే దేశ అభివృద్ధి పరుగులు పెడుతుందని 2014లోనే ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పిన విషయం కూడా ఇక్కడ గమనార్హం. బంగాళాఖాత సముద్రం ద్వారా రవాణా నడవాను అభివృద్ధి చేసుకోగలిగితే అద్భుతమైన పురోగతి ఉంటుందని ఆనాడే బాబు అభిప్రాయపడ్డారు.

## పోలవరంలో నిధుల ప్రవాహంతో జలకళ!

రాష్ట్ర అభివృద్ధిలో మరో కీలకమైన అంశం పోలవరం. రాష్ట్రమంతా సస్యశ్యామలం చేయడానికి అవకాశం ఉన్న పోలవరం పనులు చంద్రబాబు హయాంలో దాదాపు 70శాతం పూర్తయ్యాయి. జగన్ వచ్చాక రివర్స్ టెండరింగ్ విధానం కారణంతో అవి ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. అంతేకాదు.. పనులు మళ్లీ మొదటికొచ్చాయి. ఈపాటికి పూర్తవ్వాల్సిన పోలవరం ప్రాజెక్టు మరో నాలుగేళ్లకు కానీ పూర్తవదని స్వయంగా చంద్రబాబే ప్రకటించారు.

పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించడంతో దానిని పూర్తిచేసే బాధ్యత కేంద్రప్రభుత్వంపై ఉంటుంది. ఈ ప్రాజెక్టుకు ఎంత మొత్తంలో నిధులు ఇస్తామన్న విషయం బడ్జెట్‌లో పేర్కొనకపోయినా.. ప్రాజెక్టుకు అయ్యే పూర్తి వ్యయాన్ని కేంద్రప్రభుత్వమే భరిస్తుందని కేంద్ర ఆర్థికమంత్రి బడ్జెట్‌లో స్పష్టం చేశారు. పోలవరం తొలిదశ పూర్తికి అవసరమైన రూ.12,157 కోట్లు ఇవ్వడానికి కేంద్రం సిద్ధంగా ఉన్నట్లు కూడా సమాచారం.

## రైల్వే ప్రాజెక్టులకు ప్రాధాన్యం!

అభివృద్ధి పరుగులు పెట్టాలంటే ప్రాంతాల మధ్య అనుసంధానం ముఖ్యం. రహదారులు, రైళ్లు అభివృద్ధికి రాజమార్గాలు. గ్రామీణ రహదారుల గోతులను పూడ్చడానికే దాదాపు రూ.వెయ్యి కోట్లు అవుతుందని అంచనా. కేంద్రం నుంచి నిధులు దండిగా రానుండడంతో రహదారులకు మహర్దశ పట్టనుంది. మరోవైపు రాష్ట్రంలో భారీగా రైల్వే ప్రాజెక్టులు పట్టాలెక్కనున్నాయి. మంగళవారం కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు విశేష ప్రాధాన్యం ఇచ్చిన కేంద్రం బుధవారం రైల్వే బడ్జెట్లోనూ పలు రైల్వే ప్రాజెక్టులను మంజూరు చేసింది. ఇందులో అమరావతికి రైల్వేలైన్ ప్రాజెక్టు ఎంతో కీలకమైనది. రూ.2,047 కోట్లు దీనికే వెచ్చించనున్నట్లు కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటించడం సంతోషకరమైన విషయం.

ఏపీలో రైల్వేల మౌలిక సదుపాయాలు, భద్రతా ప్రాజెక్టులకు ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.9,151 కోట్లను కేటాయించడంతో పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టులు త్వరితగతిన పట్టాలెక్కే అవకాశం ఉంది. రాజధాని అమరావతిని అనుసంధానిస్తూ 56 కిలోమీటర్ల పరిధిలో రూ.2,047 కోట్లతో చేపట్టనున్న కొత్త రైల్వే ప్రాజెక్టు ప్రస్తుతం డీపీఆర్ దశలో ఉంది. విజయవాడ-ఎర్రుపాలెం నుంచి కొండపల్లి రిజర్వు ఫారెస్టు ద్వారా కృష్ణానదిని దాటి అమరావతి స్టేషన్‌కు, అక్కడి నుంచి నంబూరుకు అనుసంధానిస్తూ ఈ లైను కొత్తగా అభివృద్ధి చేయనున్నారు. దీనికోసం కృష్ణానదిపై పెద్ద వంతెన రానుంది. విశాఖ రైల్వేజోన్ నిర్మాణానికి ఏపీ ప్రభుత్వం ఇంతవరకూ భూమిని అప్పగించలేదని, త్వరలో భూమిని గుర్తించాలని ముఖ్యమంత్రి చంద్రబాబును కోరామని, భూమి కేటాయించగానే పనులు చేపడతామని చెప్పారు.

## ఇల్లలకగానే పండగ కాదు!

కేంద్రం వరాలు కురిపించింది సరే. కానీ వాటిని అందిపుచ్చుకోవడానికి వేగంగా పరుగులు పెట్టాల్సింది రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగమే. రాష్ట్ర అధికారులు కేంద్రంలోని సంబంధిత అధికారులతో, రుణ సంస్థలతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతూ త్వరితగతిన నిధులు విడుదల చేయించుకోవాల్సి ఉంటుంది. ముందుగా రూ.15వేల కోట్లు విడుదల చేయించుకోగలిగితే రాజధాని నిర్మాణం మరో ఏడాదిలో ఒక కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. రాజధానిలో ప్రపంచస్థాయి మౌలిక వసతుల ప్రమాణాలతో ప్రధాన రహదారులు, అంతర్గత రహదారులు, భూగర్భ డ్రైనేజీలు, సుందరీకరణతో వరదనీటి పారుదల వ్యవస్థ, కమ్యూనికేషన్ నెట్ వర్క్, ఫుట్‌పాత్‌లు, సైకిల్ ట్రాక్‌లు, భూగర్భ విద్యుత్తు కేబుళ్లు, కృష్ణానదిపై ఐకానిక్ వంతెన, రైతులకు లేఅవుట్ వేసి స్థలాలు అప్పచెప్పడం వంటి పనులు గరిష్ఠంగా రెండేళ్లలో ఒక దశకి చేరే అవకాశం ఉంది. అమరావతి నిర్మాణాన్ని రెండేళ్లలో పూర్తిచేస్తే స్థానికంగా నివాసాలు పెరగడంతో పాటు సందర్శకుల సంఖ్య పెరుగుతుంది. దీనివల్ల పర్యాటకం రూపంలో ఆదాయం లభిస్తుంది. మొత్తంమీద ఈ బడ్జెట్ ఏపీకి సానుకూలమైందని అనడంలో సందేహం లేదు. దశాబ్దకాలంగా అతీగతి లేకుండా ఉన్న రాష్ట్రానికి ఇదో మహత్తర అవకాశం. అటు కేంద్రంలోనూ ఇటు రాష్ట్రంలోనూ కొత్త ప్రభుత్వాలు ఏర్పడిన తరువాత ప్రకటించిన తొలి బడ్జెట్‌లోనే ఆంధ్ర జాక్‌పాట్ కొట్టింది. ఇదే చెలిమి, ఇదే స్నేహబంధం, ఇదే రాజకీయ అనుబంధం కొన దాకా కొనసాగితే రాష్ట్రాభివృద్ధి పట్టాలెక్కినట్లే...!

# కన్నులపండువగా గురుపూర్ణిమ వేడుకలు



నెల్లూరు ట్రంకురోడ్డు గాంధీనగర్‌లోని శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో గురుపూర్ణిమ ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆలయ కమిటీ వారి నేతృత్వంలో ఈనెల 21 నుంచి 29వ తేదీ వరకు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా సాయినాథునికి ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, అలంకారాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, అష్టోత్తర సహస్రనామ పూజలు నేత్రపర్వంగా జరుగుతున్నాయి. ప్రతినిత్యం భక్తులు పెద్దసంఖ్యలో ఈ పూజలు, సేవల్లో పాల్గొని శ్రీ షిర్డీ సాయినాథుని దర్శించుకుని తరిస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపకాంతులతో దేదీప్యమానం చేశారు. ఈనెల 29న సాయంత్రం 6 గంటలకు స్వామివారికి అంగరంగ వైభవంగా నగరోత్సవం నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. అనంతరం, 30వ తేదీన భక్తులందరికీ అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు కమిటీ కార్యవర్గం వారు తెలిపారు.

# నాగబాబును కలిసిన.. నూనె మల్లికార్జున యాదవ్



జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబును మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ కోర్ కమిటీ సభ్యుడు నూనె మల్లికార్జునయాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. జాతీయ మీడియా అధికార ప్రతినిధి వేములపాటి అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో, పార్టీ విషయాలను నాయకులతో చర్చించారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు మల్లికార్జునయాదవ్ చేపట్టిన జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమం విజయవంతంగా జరుగుతున్న నేపథ్యంలో, ఆయన నాగబాబును కలిసి పార్టీ సభ్యత్వ విషయాలపై చర్చించారు. సయ్యద్ ఆజాద్ జమీర్, శ్రీరామ్, గునుకుల కిషోర్, వై.రవి, గుర్రం కిషోర్, జనసేన నాయకులు పాల్గొన్నారు.

# శ్రీ రామచంద్ర మిషన్‌లో.. 'అమ్మ పేరుతో ఒక మొక్క'



నెల్లూరులోని శ్రీ రామచంద్ర మిషన్ ప్రాంగణంలో ఈనెల 24న అమ్మ పేరుతో ఒక మొక్క కార్యక్రమం నిర్వహించారు. ఆ సంస్థ సెంట్రల్ కోఆర్డినేటర్ డా. వెంకటకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక పొదలకూరురోడ్డులోని గౌతమినగర్ 2వ వీధిలో ఉన్న శ్రీ రామచంద్ర మిషన్ ధ్యానకేంద్రంలో ఈ కార్యక్రమం జరిగింది. శ్రీ రామచంద్ర మిషన్ గురువు పార్థసారథి రాజగోపాలచారి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని, ప్రధాని మోదీ స్ఫూర్తితో 'అమ్మ పేరుతో ఒక మొక్క' పేరుతో మొక్కలు నాటారు. శ్రీ రామచంద్ర మిషన్ ప్రస్తుత గురువైన (హార్ట్‌ఫుల్‌నెస్ గ్లోబల్ గైడ్) కమలేష్ డి.పటేల్ సూచన మేరకు ఈ కార్యక్రమం చేపట్టామని ఆయన తెలిపారు. ముఖ్యఅతిథులుగా ఆయుష్ జిల్లాశాఖ వైద్యాధికారి గోవింద్, రోడ్లు భవనాల శాఖ జిల్లా సూపరింటెండెంట్ గంగాధరతో పాటు శ్రీ రామచంద్రమిషన్ సభ్యులు, యోగ మిత్రమండలి సభ్యులు, పలువురు ఆయుర్వేద వైద్యులు పాల్గొన్నారు. అనంతరం ఆ ప్రాంగణంలో ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించారు.

## ఎన్‌సీసీకి బాలల ఎంపిక



ఇందుకూరుపేట మండలం కొత్తూరులోని గునపాటి రుక్మిణమ్మ–సుబ్బరామిరెడ్డి స్మారక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఇటీవల ఎన్‌సీసీలో చేరే బాలలను ఎంపిక చేశారు. నెల్లూరులోని 10–ఏ ఆంధ్ర నావెల్ యూనిట్ ఎన్‌సీసీ లెఫ్టినెంట్ కమాండర్ గణేష్ గౌడంగవే ఆదేశాల మేరకు ఈ ఎంపికలు చేపట్టారు. మొత్తం 36 మంది బాలురు, 16 మంది బాలికలు ఎంపిక య్యారు. ఆ విద్యార్థులను పాఠశాల ఇన్‌చార్జి హెడ్మాస్టర్ ఎం. వెంకటసుబ్బయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

## బిట్రగుంటలో ఉచిత వైద్యశిబిరం

బోగోలు మండలం బిట్రగుంటలోని రామస్వామిపాళెంలో ఈనెల21న ఉచితవైద్య శిబిరం నిర్వహించారు. శ్రీ విష్ణేశ్వర–శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో ఆలిండియా హ్యూమన్‌రైట్స్, జై భీమ్, డా.అంబేద్కర్ సేవాదళ్ సంస్థల ఆధ్వర్యంలో, నెల్లూరులోని డాక్టర్ బిందుమీనన్ ఫౌండేషన్ వారి వైద్యబృందం ఈ శిబిరంలో రోగులకు వైద్యసేవలందించారు. మందులు ఉచితంగా ఇచ్చారు. సర్పంచ్ జి.మంజుల, అంబేద్కర్ సేవాదళ్ అధ్యక్షుడు బత్తుల రవిచంద్ర, ఆలిండియా హ్యూమన్ రైట్స్ జిల్లా చీఫ్ దాసరి సునీల్, కార్యదర్శి ఎస్‌కె నూరుద్దీన్, మల్లి సురేష్, దాసరి తిరుమల తదితరులు పాల్గొన్నారు.

## గురుభక్తిని చాటుకున్న కాకాణి



చిన్నతనంలో తనకు విద్యాబుద్ధులు చెప్పిన అయ్యవారు చనిపోయారని తెలియగానే మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆవేదనకు గురయ్యారు. పొదలకూరులో తనకు పాఠాలు నేర్పిన సిద్ధయ్య మాస్టారు పార్థివదేహాన్ని సందర్శించి కంటతడిపెట్టారు. ఆయన అంత్యక్రియల్లో పాల్గొని గురు భక్తితో పాడె మోశారు. సిద్ధయ్య మాస్టారు మరణం బాధాకరమని ఆయన అన్నారు.

### కృష్ణపట్నంలో...

## సాయినాథునికి ప్రత్యేక పూజలు

గురుపౌర్ణమిని పురస్కరించుకుని కృష్ణపట్నం శ్రీ షిర్డీ సాయినాథుని ఆలయంలో ఇటీవల ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుల నేతృత్వంలో సాయినాథుని శోభాయమానంగా అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలుచేసి హారతులిచ్చారు. పల్లకిసేవలు చేసి, పెద్దసంఖ్యలో వచ్చిన భక్తులందరికీ అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ నిర్వాహకులు పర్యవేక్షించారు.

# అటవీశాఖ వద్ద..మొక్కలు సిద్ధం

## 4.57 లక్షల మొక్కలు నాటాలన్నది లక్ష్యం

జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో మొక్కల పెంపకం జోరుగా సాగుతోంది. ప్రధాని నరేంద్రమోడీ పిలుపు మేరకు 'అమ్మ పేరుతో ఒక మొక్క' నాటే కార్యక్రమాన్ని అటవీశాఖ వారు గత కొద్దిరోజులుగా వేగవంతం చేశారు. జిల్లాలోని అటవీ రిజర్వు ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న ప్రదేశాలను గుర్తించి అక్కడంతా మొక్కలు నాటడానికి ఏర్పాట్లుచేస్తున్నారు. ఇప్పటికే 20వేల మొక్కలను నాటామని, వాటి పరిరక్షణకు అన్ని చర్యలు తీసుకున్నామని జిల్లా అటవీశాఖ అధికారి చంద్రశేఖర్ ఈనెల 21న నెల్లూరులో విలేకర్ల సమావేశంలో తెలిపారు. రోడ్లు, ఇతర ప్రాజెక్టుల కోసం అటవీశాఖ ప్రభుత్వానికి ఇచ్చిన భూములకు ప్రత్యామ్నాయంగా, ప్రభుత్వం 412 హెక్టార్లను అటవీశాఖకు కేటాయించిందని, ఆ భూముల్లో కూడా 4.57 లక్షల మొక్కలు నాటాలనే బృహత్తర కార్యక్రమం చేపట్టామని ఆయన చెప్పారు. పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటే ప్రజలకు అందుబాటులో ఉండేలా, జిల్లాలోని 9 అటవీశాఖ నర్సరీల ద్వారా 9 లక్షల మొక్కలను సిద్ధం చేసి ఉంచామన్నారు. 'అమ్మ పేరుతో ఒక మొక్క' కార్యక్రమంలో స్వచ్ఛందంగా పాల్గొనే ప్రజలు నాటేందుకు అవసరమైన మొక్కలన్నీ అటవీశాఖ వద్ద ఉన్నాయని, వాటిని ప్రజలు ఉచితంగా పొందవచ్చని ఆయన చెప్పారు. ప్రతిఒక్కరూ తమ ఇంటా బయటా, ఊరూవాడా అంతా మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా పచ్చదనాన్ని, ప్రకృతిని కాపాడుకోవచ్చని, వర్షాలు కురుస్తున్న ఈ సమయంలో మొక్కలు నాటేందుకు అందరూ కృషి చేయాలని ఆయన కోరారు.

## 'ఉదయగిరి జిల్లా' ఏర్పాటుచేయండి

### సీఎం చంద్రబాబుకు ఉద్యమనేతల వినతి

ఎంతోకాలంగా అభివృద్ధికి నోచుకోక మెట్టప్రాంతంగా వెనుకబడి ఉన్న ఉదయగిరిని జిల్లాగా చేసి అభివృద్ధికి బాటలు వేయాలని ఉదయగిరి జిల్లా సాధన ఉద్యమ నేతలు ఇటీవల ముఖ్యమంత్రికి విన్నవించారు. గత వైకాపా ప్రభుత్వం జిల్లా విభజన చేసినప్పుడు ఉదయగిరికి అన్యాయం జరిగిందని ఉద్యమ ముఖ్యనేతలు ఈనెల 21న అమరావతిలో సీఎం చంద్రబాబునాయుడును కలిసి వివరించారు. ఉదయగిరి, ఆత్మకూరు, బద్వేలు, గిద్దలూరు నియోజకవర్గాల్లోని 21మెట్టప్రాంత మండలాలన్నీ ఇప్పుడు పూర్తిగా వెనుకబడి ఉన్నాయని, ఉదయగిరిని జిల్లాగా ప్రకటిస్తే ఆ మూడు జిల్లాల ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. ఉదయగిరిని జిల్లాగా చేయడం వల్ల రవాణా సదుపాయాలు, మౌలికవసతులు, విద్య,వైద్యం, వ్యవసాయరంగాల అభివృద్ధి జరుగుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఉదయగిరి జిల్లా కావడం కోసం గత కొన్నేళ్లుగా తాము ఉద్యమాలు చేస్తున్నామని వారు సీఎం దృష్టికి తీసుకువచ్చారు. అందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సానుకూలంగా స్పందించారని కూడా ఉద్యమనేతలు చెప్తున్నారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఉదయగిరి జిల్లా సాధన ఉద్యమనేతలు డాక్టర్ వేణు గోపాల్, షేక్ దస్తగిరి అహమ్మద్, గాజులపల్లి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి మునిసిపాలిటీకి.. కండలేరు నీళ్ళు



తిరుపతి మునిసిపాలిటీకి తాగునీటి అవసరాల కోసం అధికారులు ఇటీవల కండలేరు నుంచి నీళ్లు వదిలారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు, ఉమ్మడి నెల్లూరుజిల్లాలోని రాపూరు మండలం కండలేరు జలాశయం ద్వారా 250 కూసెక్కుల నీటిని సరఫరా చేసినట్లు తెలుగుగంగ ఎస్ఇ ఎంవి రమణారెడ్డి ఈనెల 21న తెలిపారు. నెలరోజుల పాటు ఆ నీటిని సరఫరా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విజయకుమార్‌రెడ్డి, ఏఇ తిరుమలయ్య తదితరులు పాల్గొన్నారు.

## టూకీగా...



### మినగల్లు సబ్‌సెంటర్‌కు కేంద్రం అవార్డు

బుచ్చిరెడ్డిపాళెం మండలం మినగల్లులోని ఆరోగ్య కేంద్రం సబ్‌సెంటర్ అందిస్తున్న ఉత్తమ సేవలకు కేంద్ర వైద్యశాఖ 2023–24 సంవత్సరానికి గాను 'సెంట్రల్ క్వాలిటీ సూపర్ వైజర్ కమిటీ అవార్డు'ను బహుకరించింది.

### గంగపట్నంలో కౌలురైతులకు కార్డులు పంపిణీ

ఇందుకూరుపేట మండలంలోని గంగపట్నం గ్రామం రైతుభరోసా కేంద్రంలో ఇటీవల కౌలురైతుల పొలాల సాగుకు సంబంధించిన ధృవీకరణ కార్డులు పంపిణీ చేశారు. కౌలురైతు కార్డుల వల్ల కలిగే ప్రయోజనాలను వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు తెలియజేసి అవగాహన కలిగించారు.

### కావలిలో పారిశుద్ధ్యాన్ని పరిశీలించిన కమిషనర్

కావలి మునిసిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ ఇటీవల పట్టణంలోని పలుప్రాంతాల్లో పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించారు. సిబ్బందికి అవసరమైన సూచనలిచ్చారు. ప్రజలకు నీటి సదుపాయాలతో పాటు, పరిశుభ్రతను అందించేందుకు సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆదేశాలిచ్చారు. మురుగునీటి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తుండాలని చెప్పారు.

### మాలకొండ దేవాలయానికి భారీగా భక్తజనం

కందుకూరు నియోజకవర్గం వలేటివారిపాళెం మండలం మాలకొండలో వెలసివున్న శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి ఈనెల 20న భారీగా భక్తజనం తరలివచ్చారు. స్వామివారికి భక్తులు సమర్పించిన కానుకల ద్వారా ఆలయానికి 9,49,196 రూపాయల రాబడి వచ్చిందని ఆలయ డెప్యూటీ కమిషనర్ కేబీ శ్రీనివాసరావు తెలిపారు.

### పడుగుపాడులో మొక్కలు నాటిన జనతా ఫౌండేషన్

కోవూరు మండలం పడుగుపాడులో ఈనెల 20న స్థానిక 'జనతా ఫౌండేషన్' ప్రతినిధులు మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ అని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని తెలిపారు. ఫౌండేషన్ ప్రతినిధులు నరసింహ, మనోజ్, రాఘీ, జనార్ధన్, సుబ్బారావు, రవి, కిరణ్, రామమోహన్, రాజేష్, శ్రీను, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### మనుబోలులో ఆధార్ కేంద్రాలు

ఆధార్‌కార్డుల్లో తప్పొప్పులు ఏమైనా ఉంటే సరిచేసుకునేందుకు వీలుగా మనుబోలు మండలంలో ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకు ఆధార్ కేంద్రాలను ఏర్పాటుచేస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మనుబోలు ఇన్‌చార్జి ఎంపీడీఓ సుధాకర్ కోరారు.

### రెడ్డిపాళెం విద్యార్థులకు విద్యాసామగ్రి

బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని రెడ్డిపాళెం గ్రామంలోని మండల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఈనెల 20న స్థానిక సహారా ఎడ్యుకేషనల్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నోటుపుస్తకాలు, పలకలు, బలపాలు, పెన్‌లు, పెన్సిళ్ళు వగైరా విద్యాసామగ్రిని అందజేశారు. సొసైటీ అధ్యక్షుడు యజ్ఞానీ, హెడ్మాస్టర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




కీ॥శే॥ మాగుంట రాఘవరెడ్డి గారు

## శ్రద్ధాంజలి

మా ఇంటి ఆశాజ్యోతి, నిరంతరం మా హృదయాంతరాల్లో వెలిగే ధృవతార
మా అభివృద్ధికి కారకులు, అనురాగంతో మమ్మల్ని
తన గుండెలలో దాచుకున్న ప్రేమమయుడు
మా తండ్రి కీ॥శే॥ మాగుంట రాఘవరెడ్డి గారు.
01-08-2024 గురువారం ఆ మహనీయుని 47వ వర్ధంతి సందర్భంగా
వారి పవిత్రాత్మకు మా శ్రద్ధాంజలి.

కుమారుడు
మాగుంట శ్రీనివాసులురెడ్డి
ఎం.పి, ఒంగోలు.

మనుమళ్ళు
మాగుంట కిరణ్‌రెడ్డి
మాగుంట రాఘవ్‌రెడ్డి

మునిమనవడు
మాగుంట సుబ్బరామ్‌రెడ్డి



















### మహాబలిపురంలో.. చెన్నై నెల్లూరీయుల ఆత్మీయ కలయిక

# మాగుంట, వేమిరెడ్డిలను సత్కరించిన కొండ్లపూడి సోదరులు

## జిల్లా ప్రతిష్టని పెంచండి.. ఆదర్శవంతులుగా నిలవండి - మాగుంట, వేమిరెడ్డిలకి వెంకయ్యానాయుడు సూచన

జులై 21వతేదీ ఆదివారం ఉదయం తమిళనాడు, మహాబలి పురంలోని వెల్కమ్‌హోటల్ కెన్సెస్ పామ్ బీచ్ చెన్నై నెల్లూరీయులకి వేదికగా మారింది. కొండ్లపూడి సోదరులు నరసారెడ్డి, సుధాకర రెడ్డిల పిలుపుమేరకు చెన్నై నగరంలోని నెల్లూరీయులందరూ కెన్సెస్ ప్రాంగణానికి చేరుకున్నారు.

మొన్నటి ఎన్నికలలో ఒంగోలు, నెల్లూరు పార్లమెంటు సభ్యులుగా గెలిచిన మాగుంట శ్రీనివాసులరెడ్డి, వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిల అభినందన కార్యక్రమం ఆనాటి విశేషం. ఈ కార్యక్రమానికి నెల్లూరు ముద్దుబిడ్డ.. భారత 13వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యానాయుడు ప్రధాన అతిథిగా విచ్చేశారు. అమరావతి ఉద్యమ నాయకుడు డాక్టర్ మాదాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇద్దరు ఎంపీలని వెంకయ్యానాయుడు ఆత్మీయంగా సత్కరించి అభినందించారు. నరసారెడ్డి, సుధాకరరెడ్డి సోదరులు కూడా మాగుంటని, వేమిరెడ్డిని సన్మానించారు. అనంతరం దాదాపుగా కార్యక్రమంలో పాల్గొన్న వారందరూ ఇద్దరు పార్లమెంటు సభ్యులను అభినందనలతో ముంచెత్తారు. ఈ సందర్భంగా వెంకయ్యానాయుడు మాట్లాడుతూ, ఆదర్శవంతమైన నేతలుగా రాణించి జిల్లా ప్రతిష్టని పెంచాలని శ్రీనివాసులరెడ్డి, ప్రభాకరరెడ్డిలకు సూచించారు. ప్రజా సమస్యల పట్ల పార్లమెంటులో తమ వాణి వినిపించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. నిత్యం ప్రజలకి అందుబాటులో ఉంటూ ప్రజానాయకులుగా గుర్తింపు పొందాలంటూ తమ ఆశీస్సులు అందించారు. అతి తక్కువ సమయంలో తమ ఆహ్వానాన్ని మన్నించి విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వారందరికీ నరసారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.






# స్మృత్యంజలి

అమృతమూర్తి, ఆత్మీయదీప్తి, సేవాస్ఫూర్తి

**శ్రీమతి కాటంరెడ్డి అనసూయమ్మ గారు**

(లేట్ కాటంరెడ్డి వెంకురెడ్డి గారి సతీమణి)

13 ఏప్రిల్1932 - 17 జూలై 2024

**స్మృత్యంజలి**

జూలై 27, శనివారం మధ్యాహ్నం 12 గంటలకి నెల్లూరు 'మినర్వా గ్రాండ్' హోటల్ నందు జరుగును.

**కాటంరెడ్డి కుటుంబం**


Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com